# పావగడలో మెహెర్ సంగీతలహరి

**సెప్టెంబరు 19.20వ తేదీలలో**

కర్ణాటక మరియు ఆంధ్ర బోర్డర్స్‌లో ఉన్న పావగడ అనే గ్రామంలో (ఆంధ్ర హమీర్‌పూర్) సెప్టెంబరు 19.20వ తేదీలలో ఏర్పాటుచేసిన ప్రేమిక సహవాస్‌లో 50 మంది మహిళలచే ఒకేసారి ఒకే వేదికపై మెహెర్‌బాబా పాటలు పాడించాలని నిర్ణయించినట్లు శ్రీ శ్రీనిబాబు, చెన్నై ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్ నుండి శ్రీకాకుళం వరకు రాష్ట్రంలోని అన్ని బాబా సెంటర్ల నుండి మహిళా బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొనవలిసిందిగా శ్రీనిబాబు కోరారు. ఈ కార్యక్రమానికి ఎన్నిక కాబడిన వారు, రెండు లేక మూడు రిహెర్సల్స్ నిమిత్తం విజయవాడ సెంటర్‌కు రావలసి వుంటుంది. మరిన్ని వివరాలకు -

. J. Sreeni Baba, Kalarajani School of Music , No.53, AVM Avenue 1st Main Road, Virugambakam, Chennai- 92, Ph: 09841195273, email- srinimusic@gmail.com సంప్రదించగలరు.



## పత్రిక సకాలంలో

**మెహెర్‌బాబా మాసపత్రిక మీకు సకాలంలో రాకుంటే దయచేసి శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040- 27964050, 9441218841, శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- 94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/ RNP/789/2009-11, Dt.07-01-2009



# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి : 8 సంచిక: 03 హైదరాబాద్ 2009 జూలై పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-**



# మెహెరస్థాన్ ధర్మశాల 4వ వార్షికోత్సవం

## ఆగస్టు2, ఆదివారం

కొవూరు మెహెరస్థాన్, ధర్మశాల 4వ వార్షికోత్సవ సందర్భంగా ఆగస్టు2, ఆదివారం, ఉ॥ 9 నుండి మధ్యాహ్నం 2 గంటలదాకా మెహెర్ ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు డా॥ టి. వెంకటస్వామి ఆహ్వానం పంపారు.

ఈ కార్యక్రమానికి మెహెరాబాద్ నుండి ముఖ్య అతిధులుగా శ్రీ మెహెర్‌నాధ్ బి. కల్చూరీ, శ్రీమతి రాజశ్రీ యం.కల్చూరీ, శ్రీమతి రమా కల్చూరీ, శ్రీ అన్నా కండాలే, శ్రీ మానిక్ ఉబాలే (నాగపూర్) శ్రీ కె.హెచ్.కె.ప్రసాద్, శ్రీమతి శారద, శ్రీ బి. రామక్రిష్ణయ్య, హైదరాబాద్, హాజరవుతున్నారు.

శ్రీకోడూరి ప్రసాద్‌గారు అవతారుని సప్తవర్ణ పతాకం ఎగురవేస్తారు.

ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో బాబా ప్రేమికులు హాజరు కావల్సిందిగా కార్యదర్శి శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు.

# పావగడలో రెండ్రోజుల సహవాస్

## సెప్టెంబరు 19, 20 తేదీలలో

పావగడలో అవతార్ మెహెర్‌బాబా కేంద్రంలో సెప్టెంబరు 19, 20 తేదీలలో రెండ్రోజుల బాబా సహవాస్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీ రాజా నాయుడు తెలిపారు.

కాగా, మెహెరాబాద్ నుండి శ్రీ జాల్ దస్తూర్, ప్రతాప్ ఆహిర్, శ్రీ లక్ష్మీకాంత్ థాడే, శ్రీ బి.రామక్రిష్ణయ్య, హైదరాబాద్, తదితరులు హాజరవుతున్నట్లు శ్రీ నాయుడు తెలిపారు.

బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని 18వ తేదీనుండి భోజన వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆయన అన్నారు. శ్రీ రాజానాయుడు(90, ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. డాక్టర్లు మీన మేషాలు లెక్కించారు. బాబా ప్రార్థనల అనంతరం ఆయన తిరిగి తన పూర్తి ఆరోగ్యం పొందారని, పావగడలో చక్కని బాబా సహవాస్ ఏర్పాటు తన కోర్కెగా చెప్పినట్లు ఇటీవల పావగడ వెళ్ళిన శ్రీ పి.యస్.కె.శర్మ తెలియజేస్తున్నారు. ఈ సహవాస్‌లో భాగంగా గొప్ప సంగీత విభావరి శ్రీ శ్రీనిబాబు, చెన్నై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు శ్రీ శర్మ తెలిపారు.





# బాబా సందేశం

**ఈ విశ్వమునకు ప్రభువును**
**మీ ప్రేమకు దాసుడను.**

I am the Lord of the Universe

I am slave to your love

**- మెహెర్‌బాబా**

బాబావారి ఈ సందేశాన్ని, అధ్యక్షులు మెహెర్ మండపేట, తూర్పు గోదావరి జిల్లా శ్రీ ఎమ్.పనసన్న తమ బాబా సెంటర్‌లో పెద్ద అక్షరాలతో రాయించినట్లు తెలిపారు.

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | మెహెరాబాద్‌లో మౌనం | 6-10 |
| 3. | భగవంతుని చేరుటకు మార్గములు | 11-12 |
| 4. | మౌన దీక్షలో పరీక్ష | 13 |
| 5. | హృదయభాష | 14-15 |
| 6. | హాఫీజ్ | 16-19 |
| 7. | లార్డ్ మెహెర్ | 20-23 |
| 8. | రెంటాల సూర్యనారాయణమూర్తి | 24-30 |
| 9. | అహంకారము | 31-33 |
| 10. | మా మాటలు | |
| 11. | బాటసారులు | 36-37 |
| 12. | కేటీ ఇరానీ | 38-39 |
| 13. | జీవిత సభ్యులు | 39 |

## మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# పగడదిన్నె దశమ వార్షికోత్సవం

**అక్టోబర్ 24,25 తేదీలలో,**

అవతార్ మెహెర్‌బాబా ఆధ్యాత్మిక కేంద్రం పగడదిన్నె క్యాంపు, సింధనూరు తాలూకా రాయచూరు జిల్లా కర్నాటక రాష్ట్రంలో అక్టోబర్ 24,25 తేదీలలో, శని,ఆదివారాలలో దశమ వార్షికోత్సవం, ప్రేమిక సహవాస్ జరుపుతున్నట్లు స్థానిక సెంటర్ కన్వీనరు శ్రీ వల్లూరి గాంధీ ఒక ప్రకటనలో తెలిపారు.మరిన్ని వివరాలకోసం వల్లూరి గాంధీ (09379075070) పగడదిన్నె క్యాంపు, లేదా ఫోన్ నెంబర్లు - 09902131172, 09845064723 సంప్రదించగలరు. హైదరాబాద్ నుండి సింధనూరుకు (300 కి.మి.) అనేక ఆర్.టి.సి. బస్సులు వున్నాయి.. ఆంధ్ర ప్రాంతం వారికి అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో బళ్ళారి రైల్వే స్టేషన్ చేరి బళ్లారి నుండి సింధనూరుకు బస్సు (100 కిమీ)లో చేరుకోగలరు.

# మిర్యాలగూడాలో

అవతార్ మెహెర్‌బాబా ప్రేమిక సహవాస్ - మిర్యాలగూడాలో అక్టోబర్ 6 మరియు 7వ తేదీలలో ఏర్పాటుచేసినట్లు శ్రీ గోపగాని నర్సయ్య తెలిపారు.ఈ సహవాస్‌లో ప్రత్యేకంగా - బాబాతో సహవాస్ భాగ్యం పొందినవారు తప్పక హాజరుకావలివల్సిందిగా శ్రీ గోపగాని కోరారు. 6-10-2009 ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ "చెన్నై శ్రీను బాబా మ్యూజిక్ స్కూల్ , మద్రాస్ , కేశవరావు గారు, నర్సరావుపేట, అవతార్ మెహెర్‌బాబా సెంటర్ కోఠి, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో - **ఏకాహం** నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు.

## నిజామాబాద్‌లో ప్రేమిక సహవాస్

**2009 డిశెంబరు 5,6 తేదీలలో...**

నిజామాబాద్ సెంటర్ 37వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా 2009 డిశెంబరు 5,6 తేదీలలో ప్రేమిక సహవాస్ ఏర్పాటుచేసినట్లు శ్రీ ఏ. జనార్ధనరావు ( 9908785774) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా ఆయనకోరారు.





సంపాదకీయం

# పునరంకితమవుదాం....

**జూలై 10 న బాబా ప్రేమికులందరూ** మౌనంగా వున్నారు. బాబా మౌనం ప్రారంభించిన రోజుని పురస్కరించుకుని 84వ మౌన వార్షికోత్సవాన్ని విజయవంతంగా ముగించారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మేం మౌనంగా వున్నామని కొందరు మాతో చెప్పారు. మెహెర్‌బాబా మౌనావతారుడు. ప్రేమావతారుడు. 44 సంవత్సరాలు మౌనంగా వుంటూనే మెహెర్‌బాబా 13సార్లు పలు దేశాలు పర్యటించారు. అలాగే మన దేశంలో ఆశేతు హిమాచలం 70వేల మైళ్ళు అవలీలగా పర్యటించాడాయన. బాబా నీవు మౌనం ఎందుకు చేపట్టావు? మౌన విరమణ ఎప్పుడు చేస్తావు? ఇంకా ఎంతకాలం నీ మౌనం కొనసాగిస్తావు? ఇలా ఎన్నో ప్రశ్నలు ఆయన్ని ఎందరో ఎన్నో సందర్భాల్లో నేరుగానే ఆయన్ని ప్రశ్నించారు. పత్రికా విలేఖరులు ఈ విషయమై ఆయన్ని అడగని సందర్భం అంటూ ఏదీ లేదు. వారేకాదు, బాబా మండలి సభ్యులు కూడా బాబా చేపట్టిన మౌనంపై ఇంకా ఎన్నాళ్ళు బాబా? అని అడుగుతూనే వుండేవారమని ఒక సందర్భంలో బాబాకు అత్యంత సన్నిహితుడైన మండలి సభ్యుడు సోదరుడు ఏరుచ్ చెప్పారు.

ఈ ప్రశ్నలన్నింటికీ బాబా సమాధానమిస్తూ - నేను నిరంతరం మీతో మాట్లాడుతూనే వున్నాను. మీ హృదయాంతరాలతో నేరుగా నేను మాట్లాడుతూనే వున్నాను. నేనెప్పుడూ మౌనంగా లేను. నా మౌనంలోని భాష మీకు వినపడకపోతే నా మాటలు మీకేమి అర్థమవుతాయని స్పష్టం చేశారు.

ఇది నిజం. బాబా నిరంతరం మన హృదయాంతరాలలో మాట్లాడుతునే వున్నారు. మనం కాస్తంత మౌనంగా ఆ మాటలు ఆలకించగల్గితే బాబా మాటలు స్పష్టంగా వినపడతాయి. బాబా నిత్యం మన వెన్నెంటే వున్నారు. ఆయన ప్రేమికుల ప్రతి అడుగు గమనిస్తున్నారు. బాబా ప్రతి ప్రేమికుని ఆర్తనాదాలు ఆలకిస్తున్నారు. మన నిత్య సహచరుడిగా వున్నాడు. **బాబా** అని ఆర్తితో పిలవగానే పలుకుతున్నాడు. బాధ వస్తే అయ్యోఅని అక్కున చేర్చుకుంటున్నాడు. తగిన ఉపశమనం కల్గిస్తున్నాడు. బాబా ప్రేమికులందరికీ ఈ విషయం అనుభవపూర్వకమే. బాబా ఏమన్నారు - నీ కోర్కెల చిట్టా చాలా పెద్దది. కాబట్టి నీ కోర్కెలు కాదు - నీ అవసరాలకు ఆదుకుంటానన్నారు. మెహెర్‌బాబా సాక్షాత్తూ ఈ యుగావతారుడు. భగవంతుడు. ఈ మౌన వార్షికోత్సవ సందర్భంగా ఆయన్ని దేవ దేవునిగా మనసా వాచా ప్రేమిస్తూ ఆయన సందేశాలు ఆచరించడంలో పునరంకితమవుదాం....

# మెహెరాబాద్‌లో మౌనం

**(మా ప్రతినిధి)**

**జూ**లై 10 శుక్రవారం.

బాబా ప్రేమికులందరూ, చాలామంది వారే ప్రాంతంలో వున్నా మౌనంలో వున్నారు.

ఇది బాబా ఆయన ప్రేమికులకిచ్చిన ఒక చిన్న అవకాశం.

మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి ఆయన భౌతిక దేహం వదిలేదాకా అంటే 1969 జనవరి 31 దాకా మౌనంలోనే వున్నారు. బాబా మౌనంలోనే తన ప్రేమికులకు అనేక సందేశాలు ఇచ్చారు. మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన రోజుని పురస్కరించుకుని ప్రతి ఏడాది బాబా ప్రేమికులు జూలై 10న మౌనంగా వుంటారు.

తెలుగు ప్రాంతీయుల విషయానికివస్తే, శ్రీకాకుళం నుండి హైదరాబాద్ దాకా అనేక పట్టణాల్లో మెహెర్‌బాబా ప్రార్ధనామందిరాలున్నాయి. అన్నిచోట్లా జూలై 10న బాబా ప్రేమికుల సౌకర్యార్ధం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కాగా, ఇటీవలకాలంలో ఒక దశాబ్దికి పైగా బాబా ప్రేమికులు వారి వారి వీలునుబట్టి మౌనంరోజున బాబా సన్నిధిలో ప్రశాంతంగా గడపాలని మెహెరాబాద్‌కు వెళ్తున్నారు.

అలా వెళ్ళినవారిలో మేమూ వున్నాం.

మౌనం రోజున మెహెరాబాద్ విశేషాలు క్లుప్తంగా ఆసక్తిగల పాఠకులకు తెలియజేద్దామన్నది మా ప్రయత్నం.

దయచేలి పరిశీలించండి.

జూలై నెల. ఈ నెల చాలా చల్లగా ఆహ్లాదకరంగా వుంటుంది కదా.

మెహెరాబాద్‌లోనైతే ఈ విషయంలో మరో నూరు శాతం ఎక్కువనొచ్చు.

మెహెరాబాద్‌లో బాబా సమాధి ప్రాంగణం ఎంతో ప్రశాంతంగా, చల్లగా, పచ్చని చెట్లు, నిండారా ఆకుపచ్చని లేత చిగుర్లు, ఆకులు, చెట్లపై పక్షుల కిలకిలరావాలు, అప్పుడప్పుడు వచ్చీపోయే వాననీటి తుంపర్లు, చలిపుట్టించే చల్లని గాలితో – మెహెరాబాద్ ఒక స్వర్గధామంలా వుంది.

మెహెరాబాద్‌ను భూకైలాస్ అని అభివర్ణిస్తారుగా.

ఆమాట నిజమనిపించేలా వుంది.

విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ సి, డి హాస్టల్సులో బస ఏర్పాట్లు చేశారు.





మచిలీపట్నం బాబా ప్రేమికులు తాడేపల్లి బసవయ్య గారి కుటుంబం విచ్చేసిన బాబా భక్తులందరికీ భోజన ఫలహారాలు ఏర్పాటుచేశారు. ఈ హాస్టల్సులో మొత్తం 1200 మంది రిజిష్టరుచేసుకున్నారు. మెహెర్‌పిలిగ్రిం రిట్రీట్‌లో మరో 200 మందికి బస ఏర్పాట్లుచేశారు. అలాగే, ఆంధ్రా రెస్టుహౌస్‌లో సుమారు 50 మందిదాకా భోజన, బస ఏర్పాట్లు చేశారు.

పాతతరం బాబా ప్రేమికులు వారి ఆరోగ్యకారణాల దృష్ట్యా పెద్దగా రాలేకపోయారని తెలిసింది. పూర్వంరోజుల్లో అమరతిథిలో బాబా భక్తుల రద్దీ కారణంగా వయస్సురీత్యా పెద్దవాళ్ళందరూ మౌనంరోజుకి మెహెరాబాద్‌కు వెళ్దామనుకునేవారు. మౌనంనాడు కూడా భక్తుల రద్దీ దృష్ట్యా మరో అనువైన రోజున బాబా సన్నిధిలో గడపాలనుకుంటున్నారు. ఏతావాతా, బాబా సమాధి ఏడాది పొడుగూతా బాబా భక్తులతో రద్దీగానే వుంటోంది. సి– హాస్టలు దగ్గర్లో బాబా లాకెట్లు, పుస్తకాలు ఇతరత్రా స్టాల్సు ఏర్పాటు చేశారు.

కాగా జూలై 9న రాత్రి భోజనాలయ్యాక **A** – హాస్టలులో చెన్నై శ్రీను బృందం అవతారుని మౌనవిశిష్టతపై చక్కని నృత్యరూపకం ప్రదర్శించారు.

బాబావారి మౌనాన్ని వర్ణిస్తూ ఇంతవరకూ ఒక చక్కని పాట ఎవరూ రాయలేదు. గతంలో ఒకవేళవున్నా ఈ తరంవారికి అందుబాటులో లేదనాలి. ఆలోటును తీర్చేలాగున శ్రీ సి.వై. చింతామణి, విజయనగరం సెంటర్, బాబా మౌన ప్రాశస్థ్యాన్ని వర్ణిస్తూ రాసిన పాటను శ్రీ చింతామణి వారి బృందం హృద్యంగా ఆలాపించారు.

ఈ పాటను ఈ సంచిక లోపలి పేజీల్లో ప్రచురిస్తున్నాం.

దయచేసి పరిశీలించండి.

శ్రీ బి. రామక్రిష్ణయ్య, హైదరాబాద్, బాబా మౌనంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. జూలై 9 ఉదయం పూట విచ్చేసిన బాబా భక్తులందర్నీ బాబా తన మండలివారందరితో కల్సి నివాసమున్న **మెహెరాజాద్‌కు** నాలుగు ప్రత్యేక ట్రస్టు బస్సుల్లో తీసికెళ్ళారు. మెహెరాజాద్‌లో పలు ప్రదేశాలు చూపాక మధ్యాహ్నం భోజన సమయానికి తిరిగి డి– హాస్టలుకు వచ్చేశారు.

ఐతే, అంతక్రితం అందర్నీ ఆశ్చర్యపరిచే విషయం ఒకటి జరిగింది.

అక్కడ వున్నవారంతా అధిక శాతం తెలుగు బాబా ప్రేమికులు.

మెహెరాజాద్‌కు భక్తితో వెళ్దామనుకునే సగటు బాబా భక్తులే.

అంతకుమించి వారికేం తెలియదు.

ఐనప్పటికీ, మెహెరాజాద్‌కు వెళ్తున్న ట్రస్టు బస్సుల్లో ప్రయాణించాలంటే, ట్రస్టు జారీ చేసిన కేవలం సి, డి హాస్టల్సువారికిచ్చే ప్రవేశకార్డు వుండాలని ట్రస్టు సభ్యులు శ్రీ జాల్ పి దస్తూర్ అభ్యంతరం వ్యక్తంచేసి ఆయా ప్రేమికుల్ని నిలిపివేశారు.

ఆ ప్రేమిక బృందంలో కొందరికి సి-హాస్టలువారికిచ్చే ఐ.డి. కార్డులు లేవు. బస్సు ఎక్కాలంటే ప్రవేశకార్డు తప్పనిసరని శ్రీ జాల్ పట్టుపట్టారు.

ఆ తర్వాత తేటతెల్లమయ్యిందేమంటే, ఆ ప్రేమికులు ఆంధ్రారెస్టు హౌసులో బస చేసారు కాబట్టి, ట్రస్టువారు జారీచేసిన ప్రవేశ కార్డు లేకపోయింది.

ముందుగా బస్సుఎక్కికూర్చున్న బాబా భక్తులు జాల్‌భాయ్‌ని వారించలేకపోయారు.

వారూ ఈ చిన్ని విషయంపట్ల హతాశులయ్యారు.

వారు తేరుకునేలోపల ఆంధ్రా రెస్టు హౌసు, కార్యదర్శి శ్రీ వై. యస్. రావ్ వచ్చి ఆంధ్రా రెస్టుహౌసును ట్రస్టు అనుమతితోనే కదా నిర్మించింది. వారూ బాబా ప్రేమికులే కదా అని జాల్ సాబ్‌కు సర్దిచెప్పడంతో పరిస్థితి చక్కబడింది.

బస్సులు ముందుకు సాగాయి. ప్రవేశకార్డులు లోనికి అనుమతులు ఇవన్నీ ఒక క్రమబద్దీకరణ, క్రమశిక్షణ కోసం మన కోసం మనం ఏర్పాటుచేసుకున్న నియమ నిబంధనలు మాత్రమేనని, సిద్దాంతాలు రాద్దాంతాలు పెద్దవాళ్ళు చేయడం సబబుకాదని తెలుగు బాబా ప్రేమికులు అభిప్రాయపడ్డారు.

జరగకూడనిది ప్రస్తుతానికి జరిగిపోయింది కదా...

జూలై 10 శుక్రవారం. బాబా మౌనం ప్రారంభించింది- 1925 జూలై 10.

ఆనాడు కూడా శుక్రవారమే.

జూలై 10 న ఉదయాన్నే అందరూ తెల్లవారుఝామున్నే స్నానాలు ముగించుకుని అవతారుని దర్శనానికై క్యూలో నిల్చున్నారు. ఉదయం 7 గంటలకు మౌనంగానే మౌనంలో బాబా ప్రార్ధనలు చదువుకున్నారు. అవతారునికి ఆరతి పట్టారు. ఈ విషయంలో ఎవరి అనుభూతి వారిదనొచ్చు. చిన్న పిల్లలు సయితం మౌనంగా వున్నారు. మౌనం రోజున మెహెరాబాద్ అందచందాలు ప్రత్యేకం. వాటిని మాటలలో అభివర్ణించడం కష్టం.

అయితే ఒక్కమాట, అది ఎంత అందమంటే, అవనిపై మనకోసం అవతరించిన అవతారుని అందమంతని చెప్పొచ్చు.

యద్భావం...తద్భవతి...

మౌనం రోజున **A** –హాస్టలులో ఉదయం, తిరిగి సాయంత్రం పలు సందర్భాల్లో 1925నుండీ 1969 దాకా అవతారునిపై చిత్రీకరించిన అరుదైన రంగుల సినిమాను సుమారు ఒక గంట నిడివిలో ప్రదర్శించారు.

అవతారుడ్ని తమ దగ్గరగా చూస్తున్న ఆనందం ఆ చిత్రాలు చూసిన ప్రేమికులు పొందారు. ఇదొక చక్కని ప్రదర్శన. తిరిగి సాయంత్రం మౌనంలోనే ప్రార్ధనలు- ఆరతి





అవతారునికిచ్చారు. ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు అవతారునికి ధన్యవాదాలు చెప్పేలా బిగ్గరగా మరోమారు ప్రార్ధనలు చదివి మౌనం విరమించారు. జూలై 11న ఉదయం ఏడుగంటల ప్రార్ధనలకు అందరూ హాజరయ్యారు. అంతకంటే ముందు ఆరుగంటలకు అవతారుని సమాధి సేవ మొదలయ్యింది. కోనసీమనుంచి వచ్చిన ఆడవారు క్యూలో అందరికంటే ముందున్నారు. సమాధి సేవా భాగ్యం వారిలో చాలామందికి లభించింది. వారికి హిందీ భాషరాకపోయినా, సమాధిసేవా సమయంలో ఇన్‌చార్జ్‌గా వుండే శ్రీమతి డాలీ దస్తూర్ ఆ ప్రేమికులను ప్రేమగా సమాధి సేవకు ఆహ్వానించారు. ఆ దరిమలా అందరూ వారి వారి ప్రాంతాలకు తిరుగు ప్రయాణం కట్టారు. .........

**కొసమెరుపు... మనలో మాట**

మౌనం రోజున బాబానామాన్ని మరిన్నిసార్లు జపించే అవకాశం వుంటుంది.

ముఖ్యంగా మౌనం రోజున ఆఫీసులకు సెలవలు పెట్టి ప్రత్యేకంగా మెహెరాబాద్‌కో, దగ్గరలోని మెహెర్‌బాబా ఆలయాలకో వెళ్ళిన వారికి బాబా నామస్మరణను మించి మరో పనేముంటుంది. ఒకటి రెండుసార్లు, లేదా ఓ అరడజనుసార్లు తెలియకుండానే నోరు జారినా ..... మౌనంలో మీ మనస్సును కట్టడిచేసి, అవతారుడ్ని స్మరించిన వైనం ఎంతుంటుందని ఓ తుంటరి మిమ్ముల్ని ప్రశ్నిస్తే మీరేమంటారు?

**భలే బడాయిలే అని పొమ్మనొద్దు. మనస్సులో మాట మాతో చెప్పండి. మేం మీ అభిప్రాయాలను ప్రచురిస్తాం. మీ పేరు, అడ్రస్సూ లేకున్నా ఫరవాలేదు. గోప్యం అంటే గోప్యమే. బాబా ఏం చెప్పారు. 12 సెకండ్లు.... 12 నిముషాలు కాదు...మనస్సును నిలిపి భగవంతునిపై దృష్టిసారించడం మహామహులకే సాధ్యంకాదన్నారు. మనమెంత. బాబా నామన్ని మీరు మౌనంలో స్మరించిన తీరుపై నిజాయితీగా, నిజాలురాసి, పలువుర్ని చైతన్యవంతుల్ని చేయండి. మీ లేఖలు జూలై 30లోగా మాకందేలా పంపవల్సింది. సెలవ్....**

## బాబా ట్రస్టుకు విరాళాలు

మెహెరాబాద్‌లో పలు విశేష బాబా కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా బాబా ప్రేమికులు ఇతోధికంగా విరాళాలు పంపి సహకరించవల్సిందిగా, ట్రస్టు చైర్మన్ , శ్రీ భావూ కల్చూరి ఇటీవల ఒక ప్రకటనలో కోరారు. శ్రీ భావూ గతంలో ఈ మాదిరిగా ఎప్పుడూ బహిరంగంగా బాబా ప్రేమికులనుండి విరాళాలు కోరలేదు. ఈ దఫా ఇలా విజ్ఞప్తి చేయడానికి ప్రధాన కారణం వుంది. విషయమేమంటే...

బాబా ట్రస్టుకు విరాళాలు ఇవ్వదల్చినవారు, ఇవ్వగల్గినవారూ ఎంతోకొంత చాలాకాలంగా ఇస్తున్నారు. కొందరు ఇతోధికంగా ప్రతినెలా ఠంచనుగా పంపేవారూ వున్నారు. మరికొందరు, అమరతిధి మౌన వార్షికోత్సవం వంటి సందర్భాల్లో మెహెరాబాద్‌కు వెళ్ళిన సందర్భంలో తప్పనిసరిగా ట్రస్టువారికి తమ శక్త్యానుసారం ఇస్తున్నారు. తెలుగు

బాబా ప్రేమికులు అధిక శాతం ఒక ఆనవాయితీగా ట్రస్టుకు విరాళాలు అందిస్తున్నారు. ఇది అందరికీ తెల్సిన పాత విషయమే.

అలాగే మనవారితోపాటు, ఇతర రాష్ట్రాలవారు, ఇంగ్లీషువారు, మరి ఇతర విదేశీ బాబా ప్రేమికులు ట్రస్టుకు ఒకపద్ధతిలో విరాళాలు పంపుతున్నారు. బాబా ప్రేమికులు ప్రేమతో పంపే విరాళాలతోనే ట్రస్టువారు గత కొన్నేళ్ళుగా మెహెరాబాద్‌లో అనేక ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఐతే, ఇటీవలకాలంలో దేశంలో ఆర్థిక మాంద్యం నెలకొనడంతో విరాళాలు పంపేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఈ విషయంలో ఇంగ్లీషు, తదితర విదేశీ బాబా ప్రేమికుల సంఖ్య అధికంగా వుంది. అందువల్లనే శ్రీ భావూ తొలిసారిగా బాబా ప్రేమికులను ప్రత్యేకించి మన దేశీయులు, తెలుగువారిని ట్రస్టు కార్యకలాపాల నిర్వహణ కుంటుపడకుండా ఉండేలా తమ వీలునుబట్టి విరాళాలు పంపాలని విజ్ఞప్తి చేశారు.

తెలుగువారందరూ భావూజీ విజ్ఞప్తిని సహృదయంతో అర్థంచేసుకుని తగిన విధంగా స్పందించాలని మనవి.

## సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్విట్యూడ్

ఈ విషయమై, తెలుగు బాబా ప్రేమికుల పక్షాన రాష్ట్రంలో గల అన్ని బాబా కేంద్రాలనుంచి విరాళాలు సేకరించి ట్రస్టువారికి పంపేలాగా **సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్విట్యూడ్** అను సంస్థను ఇటీవల హైదరాబాద్‌లో రిజిష్టరు చేయించారు. ట్రస్టుకు విరాళాలు పంపగోరువారు ఈ సంస్థకు అందజేసి తగు రశీదు పొందవచ్చని శ్రీ పి. రాజేంద్ర మెహెర్ ( 98490 46848) విజ్ఞప్తి చేశారు.

ఐతే, శ్రీ వై. యస్. రావు, మెహెరాబాద్ నుండి ఈ విషయమై ఒక లేఖలో బాబా ట్రస్టుకు విరాళాలు పంపగోరువారు నేరుగా చైర్మన్, అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు, అహ్మద్‌నగర్‌కు బ్యాంకు చెక్కు, బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపుకుంటేనే ఉభయకుశలోపరి అని పేర్కొన్నారు. తద్వారా రాబోయే రోజుల్లో ట్రస్టువారితోగానీ, విరాళాలు ఇచ్చినవారితో ఎటువంటి పొరపచ్చాలు రావన్నారు. తన విశేష అనుభవంతో ఈ విషయమై ప్రస్తావిస్తున్నానని అన్నారు. ట్రస్టువారికి విరాళాలు పంపడానికి సెంటర్ ఫర్ మాస్టరీ ఇన్ సర్విట్యూడ్ వంటి మధ్యవర్తి సంస్థల అవసరంలేదని ఆయన తన అభిప్రాయంగా తెలిపారు.

కుడిచేతితో ఇచ్చేది – ఎడమచేతికి తెలియరాదన్నది సూక్తి. ఇందుకు ఈ ప్రచార యగంలో కొంత మినహాయింపు తప్పనిసరి. ఏదిఏమైనా, మెహెరాబాద్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు బాబా ప్రేమికులు విరాళాలు ఇతోధికంగా అందజేసి ట్రస్టువాకికి సహకరించాలని పలువురి అభిప్రాయం.





# భగవంతుని చేరుటకు మార్గములు

*సేకరణ: వంకాయల అచ్యుతరావు.*

**మా**నవుని జీవిత ధ్యేయం భగవంతుని ప్రేమించుట. జీవితము యొక్క గమ్యంతోనే భగవంతునని తెలుసుకొని భగవంతుని చేరుట (Unit with God) ఈ జీవితగమ్యం చేరుటకు అనేక మార్గములున్నవి.

1. **జ్ఞానమార్గము:** జ్ఞానమార్గములో అన్వేషకుడు నేను భగవంతుడను అనుభవములు ద్యానముచేయును. ఇది చాల కష్టసాధ్యమైన మార్గము.

2. **కర్మమార్గము:** మనముచేసే ప్రతికర్మ భగవతార్పణ చేయుచు ఆ కర్మఫలము భగవతార్పణ బుద్దితో చేయుచు, స్వార్థరహితముగా పేరు ప్రతిష్టలను ఆపేక్షించకుండా చేయు కర్మయే కర్మమార్గము.

3. **యోగమార్గము:** యోగములో హఠయోగము చాలా ప్రమాదకరమైనది. ఒక్కొక్కప్పుడు ఈ యోగము ప్రాణత్యాగముచేయించును. అన్ని రకముల మెడిటేషన్స్ ఇందులో వచ్చును. ప్రాణాయామం గాలిని బంధించి కుండలిని కదలించి ముందుకు ప్రయాణించుట.

4. **రాజయోగము:** ఈ యోగములో ప్రయాణీకుడు (అన్వేషకుడు) మానసికంగా సన్యసించుట ప్రధానమైనది. (కోర్కెలనుండి, బంధనాలనుండి నిత్యజీవితంలో సమస్త కర్మలు చేయుచు మానసికంగా తనకెట్టి సంబంధము లేకుండా జీవించుట. ఈ ప్రపంచం ఒక రంగస్థలముగా భావించి కేవలం పాత్రలుగా జీవించుట దీని ప్రధాన ఉద్దేశ్యము. ఉదాహరణ హరిశ్చంద్ర నాటకము. ఈ ప్రకృతి ఒక పుస్తకం. మానవుడు ఈ పుస్తకమును చదువుట ద్వారా తన పాత్రను ఎలానటించాలో, తనగమ్యాన్ని ఎలా చేరాలో ఉపయోగించుకోవాలి.

5. **భక్తి మార్గము:** భక్తి మార్గము ఈ విధములుగా విభజింపవచ్చును. 1. భక్తి 2. ప్రేమ భక్తి భగవంతునికి ఏదైనా ఇచ్చుటకు సిద్దపడును. భక్తిలో కొంత ప్రదర్శన ఉండును. కాని ప్రేమలో అలాంటిది ఉండదు. ప్రేమ తనని తాను దహింపచేయును. భగవంతుని రూపము ఉండాలి. కాని ప్రేమకు ఆ రూపంతో పనిలేదు.

భగవంతుడు ఒక్కడే. భగవంతుడే ప్రేమ. ఆ ప్రేమను అనుభవించాలంటే ప్రేమించేవాడు కావాలి. అందుకే ఈ సృష్టి జరిగింది (మిధ్య) ప్రేమికుడు– ప్రేమించేవాడు. – ఒక్కడే భగవంతుడు.

God is Truth- God is love- God is one

**6. ప్రేమమార్గము:** భగవంతుని చేరుటకు అన్ని మార్గములకన్నా అత్యంత ప్రధానమైనది. సులభమైనది క్షేమమైనది ప్రేమమార్గము. అవతారుపురుషుడు ఎపుడు వచ్చినను వారు చెప్పినది, చూపినది కేవలము ప్రేమమార్గము. శ్రీరాముని అవతరించినపుడు ఎందరో మహర్షులు, ఆధ్యాత్మికోన్నతిని పొందినవారు ప్రేమతో సేవించితరించారు. ఉదా. గుహుడు, జటాయువు, శబరి మొదలగువారు.

కృష్ణావతారంలో ఎన్నో ఆత్మలు గోపికల రూపంతో జన్మించి, భగవంతునికై తపించి పరవశించి భగవంతునితో ఐక్యతనుకోరినవి. ఉదా: రాధ

**బుద్ధావతారంలో** - యజ్ఞ యాగాది క్రతువుల పేరుతో హింసప్రజ్వరిల్లినపుడు అహింస, ప్రేమ, ధర్మ, సత్యాలను బోధించెను.

జీసస్‌గా ప్రేమకు అతిప్రధానమైన ప్రాతినిధ్యము నిచ్చి ఆప్రేమమార్గము ద్వారా తనవారిని దగ్గరకు చేర్చుకొని తరింపజేశాడు. ప్రేమ సందేశము ప్రపంచానికి వ్యాప్తి చేశాడు. అట్లే మహమ్మదు- మానవులంతా ఒక్కటేనని, భగవంతుడు ఒక్కడేనని ప్రేమతో ప్రజలందరికి విశ్వసోదరప్రేమ సందేశాన్ని అందించారు. అదే విధముగా ఈ యుగ అవతారపురుషుడైన అవతార్ మెహెర్‌బాబా ప్రత్యేకించి ప్రేమ సందేశాన్ని మానవాళి కందించుటయేకాక మానవుల హృదయాలలో ప్రేమ బీజాన్నినాటి తన దగ్గరకు తీసుకొన్నాడు. మానవుడు భగవంతుని పొందుటకు ఏకైక మార్గము ప్రేమమార్గమేనని ప్రేమ సందేశాన్నిచ్చారు.

**మెహెర్‌బాబా:** నేను నిన్ను ప్రేమించాలంటే నాకృపకావాలి. అందుకై మొదటగా నీవు నన్ను ప్రేమించాలి. ప్రేమ బీజములు నీలో నాటాలన్నను నా కృపకావాలి. ఆ భగవంతుని కృపకై పాత్రులము కావలెను. ఒకసారి భగవంతుడు తనప్రేమ బీజాన్ని హృదయంలో నాటినపుడు భగవంతుని ప్రేమించడం మొదలవుతుంది. ఈ ప్రేమ దినదినాభివృద్ధిచెంది తీవ్ర రూపం చెందుతుంది. ఆత్మ యొక్క ప్రేమ తీవ్రమైన కొద్ది భగవంతుని ప్రేమ పదిరెట్లుగా ముందుకుసాగును, ప్రేమ తీవ్రతను బట్టి ఆత్మపరమాత్మల యొక్క మధ్య దూరం క్రమంగా తగ్గి పోవును. (మాయతొలగును) తీవ్ర స్థాయిలో ఆత్మ నీటి నుండి బయటకు వచ్చిన చేప మరల ఆ నీటి కొరకు ఎలా తపించునో ఆ స్థితికే చేరును. చివరిగా ఆత్మ పరమాత్మలో ఐక్యమగును.

ఇదే మోక్షము. జీవితగమ్యం. నేను భగవంతుడనను.





# మౌనదీక్షలో పరీక్ష

**అ**వతార్ మెహెర్‌బాబా మౌనం వహించిన రోజు జూలై 10వ తేదీ, ప్రపంచంలో నున్న బాబా ప్రేమికులందరూ ప్రతి జూలై 10వ తేదీన మౌనం వహిస్తారు. అలానే తాడేపల్లిగూడెంలో పూసర్ల వెంకట నర్సయ్య అనే ఒక బాబా ప్రేమికుడు మౌనం వహించాడు.

అతడు మౌనంలోనుండగా, అతని భార్య చనిపోయింది.సన్నిహితులు, దగ్గర బంధువులు అందరూ సమావేశమైనారు. వెంకటనర్సయ్య మౌనం వీడలేదు- చేరిన వారందరు అతనిని ప్రశ్నించుచుతూ వున్నారు. అతడు మౌనం వీడి మాట్లాడటం లేదు. ప్రేక్షకులందరు అతనిని దూషిస్తున్నారు. అయినాసరే, అతడు మాట్లాడుటలేదు. ఆమెకు అంత్యక్రియలు ఏర్పాటు చేశారు. స్మశాన వాటికలో కూడా అతడు మాట్లాడుట లేదు బంధువులు, ఇతరులు అందరు అతని వైఖరికి దూషించారు. మరునాడు ఈ సంగతి నాకు తెలిసింది. ఈ సమాచారం బాబాకు తెలియజేశాను. బాబా వెంటనే వెంకట నరసయ్యకు టెలిగ్రాం ద్వారా ఆశీశ్సులు పంపించారు. ఆ టెలిగ్రాం నాకు రాత్రి 10 గంటలకు చేరింది.

వెంటనే నేను లేచి, నా సహోద్యోగి శ్రీ వంగా వెంకట్రావు గారిని కలిసి, ఇద్దరము అర్థరాత్రి వేళ, వెంకటనర్సయ్య ఇంటికి వెళ్ళి, అతనిని నిద్ర నుండి లేపి, టెలిగ్రాం చదివి వినిపించి, అది ఆతనికి అందజేశాము. ఈ విధంగా వెంకటనర్సయ్య బాబాశీస్సులను అందుకొన్నాడు.

**- బాలగోపాల భాస్కరరాజు**

# జీవిత - వార్షిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు)
2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు. 3. వార్షిక సభ్యత్వం రూ.100/- 4. మీ అడ్రస్సులో పోస్టల్ పిన్‌కోడ్ తప్పని సరిగా వ్రాయవలసింది. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు. మాకు అందిన జీవిత సభ్యుల వివరాలు ప్రతి నెలా పత్రికలో ప్రచురిస్తున్నామని గమనించగలరు.

**మా అడ్రస్: ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్,**
**యాప్రాల్, ఫ్లాట్ నెం.32, బాబాస్ హౌస్,**
**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500 087,**
**ఫోన్: 99595-53218.**

# హృదయ భాష

**- ఎన్.వి.వి. సత్యనారాయణ**



**బా**బాని దగ్గరగా చూసిన వారికి ఆయన మౌనంగా వున్నారని అనిపించదు.

వ్యక్తిగత పరిచయాలప్పుడు, మనం అడిగినవాటికి ఆయన స్పందన, సమాధానంగా ఇచ్చే సౌంజ్ఞలు మనకు అర్ధమవుతాయి కాని ఆధ్యాత్మిక విషయాలప్పుడు ఇచ్చే సౌంజ్ఞలు అర్ధం కావు. బాబాది హృదయ భాష .

దీనికి సంబంధించిందే, నా అనుభవంలో జరిగిన సంఘటన వివరిస్తాను.

అది 1965 వేసవిలో బాబా పూనా గురుప్రసాద్‌లో దర్శనం ఇస్తున్న రోజులు.

ప్రతి దినం రెండు గంటలు దర్శన కార్యక్రమం వుండేది. నేను మా మిత్రులతో కలిసి వారం రోజులు పూనాలో వుండి, ప్రతి రోజు బాబా దర్శనం చేసుకుంటూ ఉండేవాళ్ళం.

అప్పుడప్పుడు బాబా తన ప్రేమికుల ఆహ్వానం మన్నించి వారిని సంతృప్తులను గావించుటకు వాళ్ళ ఇళ్ళకు వెళ్ళాలని నిర్ణయించుకునేవారు. ఉదయం దర్శనం కార్యక్రమం అయినతర్వాత మధ్యాహ్నం ప్రేమికుల ఇళ్ళకు వెళ్తుండేవారు.

మేమున్న ఆ వారం రోజుల్లో ఒక రోజు ఆ కార్యక్రమం ఏర్పాటైయింది.

అదృష్టవశాత్తు, ఆ రోజు గాయకుడు మధుసూధన్ ఇంట్లో బాబా దర్శన కార్యక్రమం .వుంది. ఈ విషయం బాబా ఉదయం పబ్లిక్ దర్శనంలో తెలియజేసారు.

అవకాశం ఉన్నవారు. ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకుని తన వెంట రావచ్చని బాబా తెలిపారు. మా మిత్రులతో కలిసి ఒక టాక్సీ మాట్లాడుకున్నాం. బాబా కారు వెనకే మేము బయలుదేరాం మధుసూధన్ ఇంటికి. ఆ ఇల్లు మెయిన్ రోడ్డును ఆనుకుని సందులో వుంది. కార్లన్నీ రోడ్డుమీద ఆగాయి.





అక్కడ నుంచి సుమారు 100 మీటర్ల దూరంలో మధుసూధన్ ఇల్లు వుంది. బాబా కారు నుంచి కాలు దింపినది మొదలు, దర్శనం ఇచ్చే చోటు వరకు ఖరీదైన చీరలు రోడ్డు మీద పరిచారు. ఆ చీరలపై బాబా చిరునవ్వులు చిందిస్తూ నడుస్తున్నారు. ఆయన వెనక మేము నడుస్తున్నాం.దారికి ఇరువైపుల నిలబడ్డవారు బాబాపై పూలు జల్లుతున్నారు.

బాబా అందగా, ఆకర్షణీయంగా, అధ్భుతంగా మెరిసిపోతు చకచకా నడుస్తున్న ఆ సుందర దృశ్యం ఎన్నటికి మరువలేనిది.

బాబా మధుసూధన్ ఇంటికి వెళ్ళి ఆయన కొరకు ఏర్పాటు చేసిన ఆసనంపై కూర్చున్నారు. అప్పటికే ఆ హాలులో 400 మంది చేరివున్నారు.

కొద్దిమందికి మాత్రమే కూర్చోడానికి చోటువుంది. మిగిలిన వారంతా నిలబడివున్నారు.

మధుసూధన్ దంపతులు బాబాకి బ్రెడ్, పాలు ఇచ్చారు.ఆ హాలులో నేను ఒక చివర నిలబడి తదేకంగా బాబావంక చూస్తూ వున్నాను. అప్పుడు **"బాబా తింటున్న ఆ రొట్టె ముక్కను నాకు పెడితే ఎంత బాగుండును"** అనుకున్నాను, ఆ తలంపు మనస్సులో కలిగిన మరుక్షణం బాబా చేతిలో తన వద్దకు రమ్మని సౌంజ్ఞ చేసారు.

అంతమందిలోవున్నా, ఆ సౌంజ్ఞ నాకేనని స్పష్టంగా తెలిసింది. వెంటనే జనం మధ్య నుండి చకచకా బాబా వద్దకు వెళ్ళాను. వెంటనే బాబా తన తింటున్న రొట్టె ముక్కను నా చేతిలో నొక్కి పెట్టినట్టు పెట్టారు. అది మహా ప్రసాదంగా నోట్లో వేసుకుని తిరిగి వచ్చాను.

బాబా సమక్షంలో కూర్చున్న ప్రతి వారికి బాబా తనకేసి చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. అందరి హృదయములు తెలిసిన వారు ఆయన.

ఈ సంఘటన వల్ల అర్ధమైంది ఏమనగా హృదయ భాషకు మాటల సంబంధం లేదు అని.

యదార్ధమైన విషయాలు మౌనంగానే ఇయ్యబడును, స్వీకరించబడును" అని బాబా సూక్తి మరువరానిది. ..

## మెహెరాబాద్‌కు

జూలై 10 మౌనదినం సందర్భంగా మెహెరాబాద్‌కు విజయనగరం సెంటర్ నుండి 65 మంది వెళ్ళామని అవతారుని దర్శనం చేసుకుని తిరిగి స్వస్థలానికి జూలై 14న వచ్చామని శ్రీ కొల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# హాఫీజ్

**హా**ఫీజ్ 1320 AD కాలంనాటి వాడు.

పర్షియా అంటే ఇరాన్‌లోని షిరాజ్ ప్రాంతంలో జన్మించాడు.

ఆయన అసలు పేరు షామ్స్ ఉద్ దిన్ మహ్మద్.

హాఫీజ్ అన్నది ఆయన కలం పేరు.

మహ్మదీయులకు పవిత్రమైన ఖురాన్ గ్రంధాన్ని ఆసాంతం ఎవరైతే కంఠస్తంచేస్తారో వారికి హాఫీజ్ అని బిరుదు ఇస్తారు.

అయితే, షామ్స్ ఉద్ దిన్ మహ్మద్ ఖురాన్‌ను 14 విధాలుగా కంఠస్తం చేసాడని హాఫీజ్ బిరుదుకు ఆయన అక్షరాల అన్నివిధాలా అర్హుడని ఆయన సమకాలీనులు అభిప్రాయపడతారు.

చిన్నతనంలో హాఫీజ్ కురచగా, నల్లగా, కురూపిలా ఉండేవాడు.

అయితే ఆధ్యాత్మికంగా ఎంతో ఉన్నత ఆలోచనలతో ఉండేవాడు.

తన తల్లిదండ్రుల్ని, అన్నదమ్ముల్ని, స్నేహితుల్ని ఇరుగుపొరుగువారందరిని ఎంతగానో ప్రేమించేవాడు. అందరికి సహాయకారిగా ఉండేవాడు. చలోక్తుల విసురుతూ ఎంతో హుషారుగా ఉండేవాడు.

అంత చిన్న వయస్సులోనే హాఫీజ్ పద్యాలు రాసి, చక్కగా వాటిని ఆలాపిస్తుండేవాడు.

ఆనాటి పర్షియా లోని గొప్ప గొప్ప కవులను, కవి పండితుల రచనలను శ్రద్ధగా చదివి వారిని అనుసరించేందుకు ప్రయత్నించేవాడు. ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో వున్న సద్గురువుల జీవిత చరిత్రలను అనేకం చదివాడు. అన్నింటికంటే మిన్నగా ఖురాన్ పట్ల అమితాసక్తి ఆతనికుండేది. ఆయన తండ్రి ఖురాన్‌ను బిగ్గరగా చదువుతుంటే హాఫీజ్ దాన్ని వల్లెవేస్తూ మననం చేసేవాడు. హాఫీజ్‌కు అపారమైన జ్ఞాపకశక్తి ఉండేది.

దాంతో ఖురాన్‌తోపాటు ఆనాటి పెద్దలు రాసిన అనేక కవితలు, పద్యాలు కంఠోపాఠమయ్యాయి. ఆనాటి కవి పండితుల్లో ప్రముఖులైన **'సాదీ'** కవితలంటే హాఫీజ్ చెవికోసుకునేవాడు. చిన్నతనంలో ఎక్కువగా సాదీ కవితలని, ఘజల్సు తరుచు పాడుకుంటూ ఆనంద డోలికలలో హాఫీజ్ ఊయలూగేవాడు.

హాఫీజ్ కూడా సాదీ అంతటి గొప్ప కవి కావాలని కలలుగనేవాడు.

ఇంతలో అతని జీవనంలో ఒక గొప్ప మార్పు వచ్చింది.

అనారోగ్యంతో అకస్మాత్తుగా తండ్రి మరణించాడు.

కుటుంబం అంతా కష్టాలపాలయ్యింది.





తండ్రికి వైద్యం చేయించడం కోసం చేసిన అప్పులు తీర్చడంలో తల్లి అష్టకష్టాలు పడడం చూసి హాఫీజ్ అన్నగార్లు ఇద్దరూ మరో పట్టణానికి ఏదైనా పనిని వెతుక్కుంటూ వెళ్ళారు.

హాఫీజ్, ఆతని తల్లి, ఇద్దరూ మేనమామ – **సాదీ** – ఇంట్లో తలదాచుకున్నారు.

గొప్ప కవి పండితుడైన సాదీ పేరు గల ఆ మేనమామ తాను కూడా గొప్ప కవిననే అభిప్రాయంలో ఉండేవాడు. నిజానికి ఆయనకి కవిత్వం ఏమి తెలియదు.

పేదరికం వల్ల హాఫీజ్ తల్లి కూలీ పనికి వెళ్తుంది. హాఫీజ్ పగటిపూట స్కూలు మానివేసి పనికి వెళ్ళడం మొదలెట్టాడు. అనేక చిన్న చిన్న పనులు చేశాక స్థానికంగా ఉన్న ఒక బేకరీలో స్థిరమైన ఉద్యోగం దొరికింది. అక్కడ ఇచ్చే జీతంలో సగం తల్లికిచ్చి మిగిలినదాంతో రాత్రి బడికి వెళ్ళడం ప్రారంభించాడు.

కాలీగ్రఫీ, ఖగోళశాస్త్రం, లెఖ్ఖలు మరి ఇతర సబక్టులతోపాటు ఖురాన్ పఠనం ఉత్సాహంగా చేపట్టాడు.

అది 1341 సంవత్సరం.

అప్పటికి ఆతని వయస్సు 21 సంవత్సరాలు.

అరబిక్, టర్కిష్ భాషల్లో హాఫీజ్ నిష్ణాతుడయ్యాడు.

ఇదిలా వుండగా ఒకరోజున బాగా ధనవంతులుండే ప్రాంతంలో ఒకరి ఇంటికి తాను పనిచేసే బేకరీ నుండి బ్రెడ్ తీసుకువెళ్ళి ఇయ్యవలసివచ్చింది.

అలా వెళ్తూ , ఆ ప్రాంతంలో ఒక అందమైన ఎతైన భవనం బాల్కనీలో నిల్చుని ఉన్న అందమైన అమ్మాయి హాఫీజ్‌కు కంటపడుతుంది.

తానింతవరకూ అంతటి అందమైన అమ్మాయిని చూసివుండలేదని హాఫీజ్ ఆమెపై మనస్సు పోగొట్టుకుంటాడు. తొలిచూపులోనే ఆ అమ్మాయి హాఫీజ్‌ను కట్టడి చేసింది. అతనికి తెలియకుండానే ఆమెపై అనురాగాన్ని, ప్రేమని పెంచుకున్నాడు. ప్రేమ మత్తులో మునిగిపోయాడు. ఆ అమ్మాయి అందం తన ఊహకందనంతగా ఉందని భావించాడు.

ఆకలి దప్పులు మరచిపోయాడు. రాత్రిళ్ళు కంటిపై కునుకు పట్టదు.

ఆ అమ్మాయి పేరు షాఖ్ ఇనబాత్ గా తెలుసుకున్నాడు.

ఇంతలోనే ఆ అమ్మాయికి **షిరాజ్** దేశ రాకుమారునితో పెళ్ళి నిశ్చయమైందని హాఫీజ్ తెలుసుకుంటాడు. ఇక ఆమెపై ప్రేమ పెంచుకోవడం వృధాని భావిస్తాడు.

అయినా ఆమె అందం అతని హృదయంపై చెరిగిపోలేదు. ఆతని మనసంతా ఆమె చుట్టూనే పరిభ్రమిస్తుంటుంది.

ఆ సమయంలో హాఫీజ్‌కు ఆ కాలంనాటి సద్గురువూ **'బాబా కుహి'** మాట గుర్తుకొస్తుంది.

ఆ సద్గురువు సమాధి కూడా షిరాజ్ పట్టణానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉంది.

సద్గురువు బాబా కుహి తాను చనిపోయేముందు ఏమన్నాడంటే, "ఎవరైతే తన సమాధి దగ్గర 40 రాత్రులు నిద్రపోకుండా జాగరణ ఉంటారో, వారికి పద్య కవిత్వం అబ్బడంతోపాటు వారి మనస్సులోని అమూల్యమైన కోరిక నెరవేరేలా తాను ఒక బహుమతి అందిస్తానని వాగ్దానం చేశాడు.

హాఫీజ్‌కు కవిత్వం మాటేమోగాని తన మనస్సులోని హృదయపు రాణిని గెలుచుకోవాలని అతని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు.

అందుకోసం సద్గురు సమాధి దగ్గర నలభై రోజులు నిద్రలేకుండా వుండాలని సద్గురువును తృప్తిపరచి ఆయన ఇచ్చే బహుమతి అందుకోవాలని నిర్ణయించుకున్నాడు. ప్రతిరోజూ హాఫీజు తన బేకరీకెళ్ళి సాయంత్రం దాకా పనిచేసుకుని తనకు తెలియకుండానే అమితంగా ఆరాదిస్తున్న ప్రియురాలింటికేసి ఆమె కంటబడుతుందేమో చూసుకుంటూ అలా నడుచుకుంటూ వెళ్ళేవాడు.

రాత్రిళ్ళు సద్గురు సమాధి దగ్గర మెళుకువుగా వుండటంవల్ల ఆతని కళ్ళు చింత నిప్పుల్లా, అగ్ని గోళాల్లా మారాయి. ఈ సమయానికి హాఫీజు ఓ తెలియని మైకం ఆవహించినట్లౌతుంది.

తనకు తెలియకుండానే తన పనేదోతాను చేసుకుపోహతున్నట్లుంది.

ఐతే హృదయంలో తన లక్ష్యం చేరుకోవాలనే ధృఢ సంకల్పంతో వున్నాడు.

ఓ రోజు ఉదయాన్నే హాఫీజు భక్తికిమెచ్చి గేబ్రియల్ – దేవదూత తన దర్శనమిచ్చింది.

గేబ్రియల్ ఒక కప్పునిండా చల్లని మధుర పానీయాన్ని ఇచ్చి త్రాగమంటుంది.

సద్గురువు కృపవల్ల ఆతని బహుమతిగా హాఫీజుకు చక్కని కవితాధార అలవడుందని ఆ దేవదూత ప్రకటించింది.

మరో బహుమతిగా ఆతని మనస్సులోని కోరిక ఏముందో కోరుకోమని అడుగుతుంది.

హాఫీజుకు నోటమాటరాదు.

అవాక్కవుతాడు.

ఎందుకంటే, తాను ఏ అందమైన అమ్మాయిని చూసి ఆకర్షితుడయ్యాడో, ఆ అమ్మాయికి వెయ్యిరెట్లు అందమైనదన్నట్లు , ఈ దేవదేవత హాఫీజుకి అగుపిస్తుంది.

అప్పుడు హాఫీజు మనస్సులో అనుకుంటాడు కదా...

ఈ దేవ దూతయే ఇంత అందంగా వుంటే,

ఇక ఆ దేవుడు ఎంత అందంగా వుంటాడో కదా అనుకుని,.......








**మెహెరాబాద్‌లో బాబా ప్రేమికులకు చక్కని ఆతిథ్యం ఇస్తున్న ఆంధ్రా రెస్ట్ హౌస్.**

ఆ దేవదూతతో...క్షణమైనా ఆలోచించక..

నాకు దేవుడు కావాలని హాఫీజు కోరుకుంటాడు.

దాంతో నీవు పట్టణంలోని ఫలానా ప్రాంతానికి వెళ్తే అత్తరూ, పళ్ళూ అమ్మే దుకాణం వుంటుంది. ఆ అంగడిలో మహ్మద్ అత్తర్ అనే భగవత్‌సాక్షాత్కారం లభించిన సద్గురువు ఒకరుంటారు.

నీవు వెళ్ళి ఆతన్ని కలవమని హాఫీజుతో దేవదూత చెప్తుంది.

హాఫీజు ఆ మాదిరిగానే ఆ సద్గురువు దరిచేరి ఎనలేని సేవలు చేస్తాడు.

సద్గురువు భౌతిక దేహం వదిలేశాక ఆయన నిజరూపం హాఫీజుకు అర్ధమవుతుంది.

అప్పటికే హాఫీజుకు భగవసాక్షాత్కారం లభిస్తుంది.

మెహెర్‌బాబా – హాఫీజును గొప్ప సద్గురువుగా ప్రకటించారు.

ఇరాన్ దేశంలో హాఫీజు సమాధి నేటికీ పూజలందుకుంటోంది.

మనస్సులోని కోర్కెలు నెరవేరుస్తూన్న సద్గురువుగా స్థానికుల ఆరాధనలు, పూజలు హాఫీజు అందుకుంటున్నాడు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

**ఖా**ళీ సమయంలో చదువు,, భోజనం, ఆట, విశ్రాంతి అయ్యాక నన్ను స్మరించండి. నా నామస్మరణ వల్ల మీలో భగవత్ప్రేమ పుట్టుకువస్తుంది. నా గురువు నన్ను భగవన్మార్గంలో ఎప్పుడు పడేస్తాడు అన్న ప్రశ్న మిమిల్ని వేధించాలి. ఆ దేవ దేవుని దర్శనం లభించేది ఎప్పుడని మీరు పరితపించాలి. పరమాత్మతో నేనెప్పుడు ఏకమవుతానని కలవరించాలి. ఈ మార్గంలో ఏముందో నన్నే ఆసక్తితో తపించాలి. ఇలాచేస్తే దైవీ ప్రేమామృతాన్ని రుచిచూడాలన్న తపన దానంతట అదే కలుగుతుంది. వెంటనే నేను ముందుకు త్రోస్తాను అని బాబా పిల్లలకి చెప్పారు.

బాబావారు పిల్లలతో చాలాసేపు వాళ్లని ఆలింగనంచేసుకుని ముద్దాడేవారు. వీపునిమిరేవారు. సరదాగా ఆటలు ఆడేవారు. వాళ్ళకి స్వయంగా భోజనం వడ్డించేవారు. రాత్రిళ్ళు నిద్రపోతుంటే, వోకంట కనిపెట్టుకొనేవారు.

ఇంత ఆసక్తితో పిల్లల ఆలనాపాలనా చూస్తూకూడా బాబా అన్నింటికీ అతీతులుగా వుండేవారు. స్కూలు, ఆశ్రమం అంతా ఎందుకు అనేవారు ఛాన్జీతో. ఇంత తలకాయ పోటు ఎందుకు అంటావ్ అని ప్రశ్నించారోకసారి.

అసలుసిసలైన భగవత్ ప్రేమికుల్ని తీర్చిదిద్దాలని స్కూలు, ఆశ్రమం పెట్టాము. అందరినీ ఆ అదృష్టం వరించదుకదా. కొద్దిమంది భగవత్ ప్రేమికులుగా మారతారు. మరివాళ్ళలో ఒక్కడే అందరికీ తలమానికంగా నిలబడతాడు. ఆ ఒక్కడికోసం ఇంత బాదరబందీ అవసరమేనంటావా? అని ఛాన్జీని ప్రశ్నించారు. అతగాడు జవాబు చెప్పేలోపల తామే చెప్పారు. ఈ శ్రమ విలువ నీకో పట్టాన బుర్రకెక్కదులే అన్నారు. పాపం ఛాన్జీ. అతను ఎదురు చెప్పలేదు తలాడించాడు. అంతే.

బాబావారు ఎక్కువసేపు పిల్లలతోనే గడపుతున్నారన్న సంగతి పాఠకులకి తెలుసుకదా. మరి మండలివారిని ఆయన పట్టించుకొంటున్నారా అన్న ధర్మసందేహం రావచ్చు. అయితే వినండి. పిల్లలతో ఎంత బిజీగావున్నా బాబా మండలివారి పట్ల ఏమాత్రం అశ్రద్ధ చూపలేదు సరికదా, వాళ్ళకి అప్పగించినపనులు ఎలా చేస్తున్నారు, ఎంత శ్రద్ధగా చేస్తున్నారు అని కనిపెట్టే ఉంటున్నారు. మండలి వారందిరికీ తలో పనీ పురమాయించారు బాబా.



మెహెర్‌బాబా జూలై 2009

ఏమాత్రం అలక్ష్యం కనిపించినా వూరుకోవటంలేదు.

అప్పట్లో మెహెరాబాద్‌లో ఏడుగురు స్త్రీలు వుంటున్నారు. వీరు– దౌలత్, ఆమె కూతురు మెహెరా, సూన, ఆమె కూతురు ఖోర్షేద్, నజా, డాలీ, బాబా వదినగారు పెద్ద ఖోర్షేద్ వీళ్ళందరికీ క్షణం తీరికలేని పనిపెట్టారు బాబా. గుల్మాయి రోజూ నగర్ నుంచి వస్తోంది. స్త్రీ మండలికి చేదోడు వాదోడుగా వుంటోంది.

ఈ మధ్యన బాబా భోజనం చేయటంలేదు. రోజుకోసారి కాఫీ త్రాగుతున్నారు అంతే. ఎప్పుడైనా కాసిని పాలుతీసుకొంటున్నారు. రెండు ఫ్లాస్కుల్లో కాఫీ, పాలు మెహెరా పంపుతోంది. కొండపైకి లాహు అని వో 13 ఏళ్ళ కుర్రవాడు వాటిని పైకి తెస్తున్నాడు. బాబా సమక్షంలో పెడ్తున్నాడు. బాబా మకాం గొయ్యిగది అని పాఠకులకి గుర్తుందికదా. ఆగోతిలోనే బాబా పరుపు వేశారు. దానిపైనే ఆయన పడుకొంటున్నారు. బహుశా ఈ ప్రకారంగా బాబా వారికి శారీరకంగా కొంత వూరట కల్గిస్తున్నారు అనాలి.

ఉదయాన్నే బాబా దిగువ మెహెరాబాద్‌కి వచ్చి ఎవరెవరు ఎలాపని చేస్తున్నారో చూసేవారు. అందర్నీ పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు కనుక్కొనేవారు. ఎగువ మెహెరాబాద్‌లో క్షణం తీరిక వుండేదికాదు. కొండపైకీ, క్రిందకీ వస్తూ పోతూంటే, బాబా వారు బాగా అలసి పోతున్నారని మెహెరా కొట్టుకుపోయింది. “ఇలా పదే పదే తిరగకు బాబా. ఉపవాసంతో బాగా నీరసించిపోయావు బాబా”, అని పదే పదే వేడుకొంది. దిగువ మెహెరాబాద్‌కి రిక్షాలో రా బాబా అని ప్రాధేయపడింది. బాబా మెహెరా మాటని కాదంటారా, సరేనన్నారు. ఈ రిక్షా మామూలు సైకిల్ రిక్షాకాదు. దీన్ని లాగుడు రిక్షా అంటారు. అంటే వొకరో ఇద్దరో, బండిని ఎడ్లు లాగినట్లు, లాక్కువస్తారు. కొండపైనుంచి లాగుడు రిక్షాలో వచ్చినా, తిరిగి వెళ్లేటప్పుడుబాబా నడుస్తూనే కొండ ఎక్కుతున్నారు. గమ్మత్తు ఏమిటంటే, కొండపైన బాబా చాలా చలాకీగా కనిపించేవారు. అలసట ఆయన మొహంలో కనిపిస్తే వొట్టు. అటూ ఇటూ చకచకా తిరుగుతూ వుషారుగా కనపడేవారు. ఆశ్రమం పిల్లలతో సరదాగా రకరకాల ఆటలు ఆడేవారు. కానీ క్రికెట్టు బాబాకి ఇష్టమైన ఆటకదా. బ్యాటింగ్‌కయినా, బౌలింగ్‌కయినా

ఎంతో శక్తికావాలి. అంత ఉపవాసంలోకూడా చిరునవ్వుతో బాబా బ్యాటింగ్ చేసేవారు. ఆ చూసేవాళ్ళకి ఆశ్చర్యంవేసేది.

వోరోజు సాయంత్రం ఎప్పటిలానే, మండలివారు, పిల్లలు బాబా దగ్గరకి చేరారు. ఎప్పటిలాగే వో కొత్త ఆధ్యాత్మిక రహస్యాన్ని వాళ్ళకి బాబా చెప్పారు. పరమ సద్గురువుకి 14 మంది మండలి వుంటుందని లోగడ చెప్పారు కదా. ఈసారి వాళ్ళందరికీ బ్రహ్మైక్యం ఎలా దొరుకుతుందో వివరించారు.

పధ్నాలుగురు ఆధ్యాత్మిక సుసంపన్నులతో పరమసద్గురువు మండలిని ఏర్పాటు చేస్తాడు. మండలిలో చేరాలంటే దైవీసంస్కారాలు వుండాలి. అంటే మండలికి సభ్యత్వానికి అవసరమైన కనీస దైవీసంస్కారాలు వున్నవారే వీరంతా. వీరిలో ఇద్దరు స్త్రీలు. వీరు ఎవరు, ఎక్కడ వున్నదీ ఎవరికీ తెలీదు. వీళ్ళ విధి, వాళ్ళ అర్హతని బట్టి వుంటుంది. ఎందుకంటే అందరి దైవీసంస్కారాలు వొకేలావుండవుకదా! మండలి ఏర్పడ్డాక, అంటే మండలిలో చేరాక, వీరికి ఎవరికీ ప్రాపంచిక సంస్కారాలు అంటవు. వాళ్ళు తమ ఆధ్యాత్మికోన్నతికోసం సాధన చేయాల్సిన అవసరమూ వుండదు. ఎందుకని అంటే, ఇహాపైన, వీరందరి బాగోగుల్ని ప్రభువే చూసుకొంటాడు. సమయం రాగానే పరమాత్మనుభూతిని కల్గిస్తాడు కాబట్టి, మండలిలో చేరటంతో ఈ సాధకుల యొక్క సాధన ఆగిపోయినట్లే.

ఇంకో సంగతి చెప్తాను. ఈ మండలి వారు ఎవరికీ తాము పరమ సద్గురువు మండలిలో వున్నామన్న సంగతి తెలీనే తెలీదు. తమని పరమ సద్గురువు ఏకతాటిన నడిపిస్తున్న వైనం కూడా వీళ్ళకు తెలీయదు. అలానే ఆధ్యాత్మికంగా ముందుకు వెళ్తున్న సంగతి కూడా చిట్టచివరి వరకూ, పరమాత్మానుభవం కలిగే వరకూ తెలియదు. మండలి వారిలో ఒకరు పెద్ద. ఇతనే ఛార్జిమాన్. అందరి బాధ్యత ఈయనిదే. అందరి బరువు వీరి భుజాలపైనే. ఈయనే, సమయం రాగానే, గురువుగా ప్రకటితమవుతాడు. అప్పటివరకూ మండలి ఏర్పాటు, మండలివారి విశ్వకార్యక్రమం యాధృచ్ఛికంగా జరుగుతాయి.

మండలిలో చేరిన ఆధ్యాత్మికోన్నతులకి ప్రాపంచిక సంస్కారాలు అంటవని చెప్పాను. గుర్తుంది కదూ మరి. మండలిలో చేరక పూర్వం వాళ్లకి ప్రాపంచిక సంస్కారాలు వున్నాయికదా. వాటి మాటఏమిటి? ఇవన్నీ ఖర్చు కావాలి. ఎలా ఖర్చు అవుతాయి. ఎలా కరిగి మాయమవుతాయి? ఒకరోజులో జరగదు ఇది. కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. మూడు నాలుగు జన్మలు ఎత్తక తప్పదు. ఈ ప్రక్రియ వుందే దీన్ని ప్రారబ్ధం అంటారు. ఇంకోమాటలో చెప్పాలంటే ఇదే విధివిలాసం. ఐతే, మండలి వారు ఎవరికి వారే తమ ప్రారబ్ధఖర్మని అనుభవించరు. కలిసి కట్టుగా, సమిష్టిగా ముందుకు ప్రయాణం





చేస్తూ, తమ ప్రాపంచిక సంస్కారాలని తుడిచి వేసుకొంటారు. వాళ్ళ ఆధ్యాత్మిక సంస్కారాలకి ఏమాత్రం ముప్పు వుండదు. జన్మలు ఎత్తుతున్నా, దైవీ సంస్కారాలు పదిలంగానే వుంటాయి.

ప్రారబ్ధం ఎంత గొప్పది అంటే గౌతమ బుద్ధుడుకూడా దానిబారినుంచి తప్పించుకో లేక పోయాడు. గత ప్రారబ్ధం వల్లనే తన నిజ చైతన్యం తెలీకుండా పెరిగాడు. నేపాల్ రాజకుమారుడిగా భోగభాగ్యాలు అనుభవిస్తూ రోజులు గడిపాడు. ఎంతకాలం? తన ప్రారబ్ధం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే వరకూ. మరి, ప్రారబ్ధ సంస్కారాలు తుడిచి పెట్టుకు పోగానే, ఆ క్షణం రానే వచ్చింది. వెంటనే సర్వం త్యజించాడు. బ్రహ్మైక్యం పొందాడు. బుద్ధుడు అయ్యాడు.

పరమ సద్గురువు తన మండలి వారి గురించి ఎప్పుడు పట్టించుకొంటాడు. పరమాత్మనుభవం పొంది స్థూల భూమిక పైకి తిరిగివచ్చాక,

మండలివారి ఆధ్యాత్మికోన్నతి పై దృష్టిపెడ్తాడు.

అదే వీళ్ళు, ఇంకా ప్రారబ్ధ ఖర్మనుంచి బయట పడలేదే. ఇంకా అందులోనే గిలగిలా కొట్టుకొంటున్నారే, అని గమనిస్తాడు. అంతే మహోన్నత కార్యక్రమానికి నాందీ జరుగుతుంది. ఈ కార్యక్రమం ఎవరి కళ్ళకీ కనబడదు. చాలా రహస్యంగా, గోప్యంగా జరుగుతుంది.

ఇంతకీ ఆ కార్యక్రమం ఏమిటి? మండలి వారికి ప్రారబ్ధ ఖర్మలనుంచి విముక్తికల్గించడం. ఇది ఎలా చేస్తాడు అంటే, వాళ్ళ ప్రారబ్ధఖర్మని తన భుజాలపై వేసుకొంటాడు. ప్రారబ్ధఖర్మ వో పట్టానపోదుకదా. అది పోయేవరకూ నరకయాతన అనుభవిస్తాడు. వొళ్ళు హూనం అవుతుంది. సంస్కరాలు మటుమాయంకాగానే అందరికీ బ్రహ్మైక్యం లభిస్తుంది. ఆ! అందరికీ, మండలిలోని ప్రతివాళ్లకీ, అందరికీ వొక్కసారే ఆ వరం దొరుకుతుంది. ఇది ఏలాగున సాధ్యం? అందరి ప్రారబ్ధ సంస్కారాలు వొక్కలా వుండవుకదా. వొకరికి తక్కువ, మరొకరికి ఎక్కువ వుంటాయి కదా అని అంటారా? నిజమే ప్రారబ్ధం అందరికీ వొకలా వుండదు. అయినాసరే, సద్గురువు కృపవల్ల, సంస్కారాలు ఒక్కసారే పోతాయి. పరమాత్మానుభవం వొకేసారి దొరుకుతుంది. ఇది కష్టమైనపని. అంతాఇంతా కష్టంకాదు. చాలా కష్టం. అతి జటిలమైనది. ఉత్కృష్టమైనదికూడా. దీనితో పోలిస్తే, మానవాళిని ఆధ్యాత్మికంగా ముందుకు త్రోయటం ప్రభువుకి చాలా తేలిక. తన దైవీ విశ్వకార్యక్రమం నిర్వహిస్తూనే, మండలి ప్రారబ్ధ ఖర్మలని తొలిగిస్తాడు. అందువల్లనే శారీరకంగా ఆయన పడే బాధని మాటలకి అందదు.

***(సశేషం)***

## మెహెరుని సేవలో ధన్యుడు

# రెంటాల సూర్యనారాయణమూర్తి



**నా** పని నేను చేసుకుంటాను అన్నారు అవతార్ మెహెర్‌బాబా. అయినా ఆధ్యాత్మిక ప్రయోజనం అందరికీ కలిగించడానికి తన పనిలో పాల్గొనే అవకాశాన్ని అర్హులైన కొందరికి మాత్రమే బాబా అనుగ్రహిస్తారు. మండలివారు ఆయన సేవలో ప్రథమ స్థానంలో ఉంటారు. ఆ తర్వాత శ్రేణిలో నిస్వార్థంగా బాబా సేవకు అంకితమై దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నవారు ధన్యులు. అలాంటి వారిలో అగ్రగణ్యుడైనవారు రెంటాల సూర్యనారాయణ మూర్తి. ఆయన తూర్పు గోదావరిజిల్లాలో రాజమండ్రి సమీపానగల శ్రీరంగపట్టణంలో జన్మించారు. వారి తండ్రి గంగరాజుగారు. ఆధ్యాత్మిక మార్గంలోని బాటసారి, సూర్యోపాసకుడు. తల్లి సీతమ్మగారు. మేమందరం బామ్మగారని ఆమెను పిలిచేవారం. మెహెర్ ప్రేమికులకు ఆతిథ్యం యివ్వడంలో అన్నపూర్ణమ్మ- ఆ సీతమ్మ - బామ్మగారు.

అవతార్ మెహెర్‌బాబా మొదటి ఆంధ్ర దేశ పర్యటనలో రాజమండ్రి గురుకులంలో 23.01.1953 రోజు దర్శనం యిచ్చారు. ఆరోజు మొదటిసారిగా రెంటాల సూర్యనారాయణ మూర్తి గారు అవతార్ మెహెర్‌బాబా దర్శనం చేసుకున్నారు. మొదటి దర్శనంలోనే బాబా దివ్యత్వంలో ఆయనకు అచంచల విశ్వాసమేర్పడింది. ఆనందాశ్రువులు ప్రవహిస్తుండగా తన్మయత్వంలో బాబాయిచ్చిన అరటి పండు ప్రసాదాన్ని స్వీకరించి ఆయన వైపు చూచారు. బాబా శిరస్సు వెనకాల దేదీప్యమానంగా ప్రకాశించే కాంతి చక్రాన్ని చూశాడాయన. వెంటనే తన తండ్రి చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నారు. ఆయన తండ్రి-శ్రీ సూర్యనారాయణ మూర్తి ఇలాంటి కాంతి చక్రం శిరస్సు వెనకాల ప్రకాశించే వ్యక్తిని నీవు చూస్తావని, ఆయనే నీకు దైవం, సర్వస్వం నీకని ముందుగానే జోస్యం చెప్పారు. బాబా మానవ రూపం ధరించిన భగవంతుడనే అచంచల విశ్వాసంతో తన యావజ్జీవితమంతా బాబా సేవకు అంకితం చేసుకొన్న నిరాడంబరుడు, నిస్వార్థసేవకుడు త్యాగశీలి శ్రీ సూర్యనారాయణ మూర్తిగారు.

జీవిత భీమా సంస్థలో ఏజెంట్‌గా పనిచేస్తూ, డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పదోన్నతితో నిజామాబాదుకు బదిలీపై శ్రీ రెంటాల వచ్చారు. బాబా విధానాలు మన అవగాహనకు





అందకుండా ఉంటాయి. ఆయన పనికోసం అర్హులైన వారిని ఎన్నుకోవడం, వారి ద్వారా ఆయన నిర్ణయించిన చోట నిర్ణయించిన ప్రకారం ఆయన నామాన్ని ఆయన దరికి చేర్చుకోదలచిన వారికి వినిపించే కార్యక్రమం అతి సహజంగా బాబా జరిపిస్తారు. అది విచిత్రంగా అద్భుతంగా ఉంటుంది. అలాగే బాబా గురించి అసలే తెలియని తెలంగాణా ప్రాంతంలో తన నామాన్ని వినిపించి విస్తరింపజేసే బాధ్యతను యిచ్చి రెంటాల సూర్యనారాయణ మూర్తిని శ్రీరంగపట్టణం నుండి నిజామాబాద్‌కు పంపించారు బాబా.

నిజామాబాదుకు రాకముందే సూర్యనారాయణ మూర్తిగారు శ్రీరంగపట్టణంలో 1960వ సంవత్సరంలోనే గొప్ప సహవాస్ కార్యాన్ని నిర్వహించారు. బాబా సోదరుడు జాల్, ఆదీ-కె-ఇరానీ బాబా కార్యదర్శి మరియు చాలామంది ప్రముఖ బాబా ప్రేమికులు ఈ సహవాస కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిజామాబాదులో జీవిత భీమా డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఉద్యోగంలో చేరగానే సో॥ రెంటాల సూర్యనారాయణ మూర్తి గారు తన యింటిలో కేంద్రం ప్రారంభించి ప్రతివారం బాబా భజనలు సహవాసాలు నిర్వహించారు. శ్రీ ఆదీ-కె-ఇరానీ గారు శ్రీ కుటుంబశాస్త్రి గారు శ్రీ అమర్ సింగ్ సైగల్, సి.డి.దేశ్‌ముఖ్, శ్రీ మధుసూదన్ పుండ్, సుభద్రలు మొదలగు ప్రముఖ బాబా ప్రేమికులు మూర్తి గారి ఆహ్వానం మేరకు నిజామాబాదు సందర్శించి సహవాస కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగించారు. భజనలు గానం చేసారు. నేను 1969 మార్చి మాసంలో ఉద్యోగరీత్యా నిజామాబాదుకు బదిలీపై వెళ్ళాను. అప్పటికి నాకు మెహెర్‌బాబా గురించి తెలియదు. నేను శ్రీ కళ్యాణ్‌రావ్ జోషి గారి ప్రక్కన శ్రీ రెంటాల సూర్యనారాయణ మూర్తి గారి ఇంటికి ఎదురుగా ఉన్న ఒక ఇంటిలో అద్దెకు చేరాను. ఏప్రిల్ మాసంలో పూనా గురుప్రసాద్‌లో బాబా పిలుపు మేరకు జరిగిన ఆఖరి దర్శనం కోసం నాలుగు బస్సులు ఏర్పాటు చేసి ప్రేమికులందరినీ బాబా దర్శనానికి తీసుకొని వెళ్ళారు మూర్తిగారు. వారందరూ 'జైబాబా' అని ఒకరినొకరు అభినందించుకొంటూ ఆలింగనం చేసుకుంటుంటే వింతగా నేను చూశాను. నాలో నేను పలుమార్లు నవ్వుకున్నాను కూడా. అప్పటికే నన్ను మెహెర్‌ప్రభువు తన వలలో వేసుకున్నారని ఆ తర్వాత గాని తెలియలేదు. ఆ తర్వాత జరిగిన సహవాస్ కార్యక్రమాల్లో పాల్గొని, నిజామాబాదులో ఎల్లమ్మ గుట్టపైన నిర్మించిన బాబా కేంద్ర నిర్మాణంలో పాల్గొంటూ మూర్తిగారి సాహచర్యంలో అవతార్ మెహెర్‌బాబాలో పరిపూర్ణ విశ్వాసాన్ని పొందగలిగాను.

అవతార్ మెహెర్‌బాబా కేంద్రాలు నిర్మించడంలో శ్రీ రెంటాల సూర్యనారాయణ మూర్తిగారు నిర్విరామంగా కృషి చేసారు. నిజామాబాదు, కన్‌కల్, కామారెడ్డి, జూబ్లీ హిల్స్ హైదరాబాదులలో నిర్మించిన బాబా కేంద్రాల భవనాల కోసం ఎనలేని కృషి చేసారు. ఊరూరా ఎన్నో కేంద్రాలను తెలంగాణాలో ఆయన ప్రారంభించారు. తనకోసం

ఉండటానికి చిన్న ఇల్లైనా కట్టుకోలేదు కాని బాబా కేంద్రాల కోసం త్యాగం చేసిన ధన్యజీవి. హారతి కర్పూరంలాగా బాబా పనిలో 'నేను' ఏమీ మిగలకుండా దహించుకొనిపోవాలని చెప్పేవారు మూర్తిగారు. జూబ్లీ హిల్స్ కేంద్రానికి ఒకసారి డబ్బు అవసరం కాగా ఆయన తన సొంతకారు అమ్మి ఆ వచ్చిన డబ్బు తెచ్చియిచ్చి ఆగిన పనిని కొనసాగించమన్నారు. 28.01.72 రోజు నిజామాబాదు కేంద్రం ప్రారంభమైంది. 14.11.86 రోజు జూబ్లీహిల్స్ లోని కేంద్రం ఆలోచాచే ప్రారంభించబడింది. 1978వ సంవత్సరంలో నిజామాబాద్‌లో అతిథిగృహం నిర్మించబడింది. దాని ప్రారంభోత్సవ సమయంలో సహవాసం నిర్వహించబడింది. దానికి బాబా కార్యదర్శి ఆదీ-కె-ఇరానీ గారు ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగించారు. ఆ అతిథిగృహంలోనే మూర్తి గారు కుటుంబ సభ్యులు ప్రస్తుతం నివాస ముంటున్నారు. అది బాబా ప్రేమికులకు నిత్యాన్నదాన సత్రంగా ఉండింది.

నిజామాబాద్ కేంద్రం నిర్మించే సమయంలో ఎన్నుకొన్న కొందరినుంచే విరాళాలు అడగడానికి వెళ్ళేవారు. ఈ విషయంలో కూడా మూర్తిగారి పద్ధతి విలక్షణంగా ఉండేది. అవతార్ మెహెర్‌బాబా భగవంతుడు. లక్ష్మీపతి. ఆయనకు డబ్బు కొదవలేదు. కాని నీకు అవకాశం యిస్తున్నాడు. నీ సంపదకు దివ్యత్వాన్ని చేర్చుకో. ఆయన యిచ్చిన అవకాశాన్ని వినియోగించుకో అని చెప్పేవారు. అడగడానికి వచ్చిన వారికి యింత పొగరా అని వారనుకునేవారు కాదు. కాని ఆయనలోని ఆవేశాన్ని, బాబా యెడలగల అచంచల విశ్వాసాన్ని గమనించి సాదరంగా ఆయనను కూర్చొబెట్టి బాబా గురించి ఆయన చెప్పే మాటలన్నీ విని, ఆ అవకాశాన్ని వినియోగించుకొనే వారు. బాబా నామవ్యాప్తిలో ఆయన సేవకై ఎంత ఉద్రేకం, తనయత్వం ఉండేదో మాములు సమయంలో ఆయన అంతే వినమ్రతగా ఉండేవారు.

బాబా నామవ్యాప్తిలో కూడా ఆయన విధానం అసామాన్యంగా ఉండేది. ఒకసారి మూర్తిగారు జాయింట్ కలెక్టర్ గారిని బాబా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆహ్వానపత్రికలు ముద్రించడం అయిపోయింది. కార్యక్రమానికి రెండు రోజులు ముందు ఆయన అత్యవసరంగా క్యాంపుకు వెళ్ళే అవసరం వచ్చిందని, తాను రాలేనని మళ్ళీ ఇంకొక సారి వస్తానని ఆయన చెప్పారు. వెంటనే మూర్తిగారు ఆయనను పేరుతో సంబోదించి, ఇది మీకు భగవంతుడిచ్చిన అవకాశం. అది కర్తవ్య నిర్వహణలోని మీ అవసరం. దేవుడిచ్చిన ఈ అవకాశాన్ని వినియోగించుకుంటారో, మీ కర్తవ్య నిర్వహణకే వెళ్తారో, మీరే నిర్ణయించుకోండి అని ఉద్వేగంగా మాట్లాడారు. ఆయన క్యాంపుకు వెళ్ళడం మానుకొని బాబా కార్యక్రమంలో పాల్గొన్నారు. అది మూర్తిగారు మాటల్లోని శక్తి, బాబా ప్రేమ కలిగించిన పారవశ్యపు ప్రభావం. ఆరోజుల్లో మూర్తిగారు తన కార్యనిర్వహణలో కూడా అధికారులందరిలోకి ఉచ్ఛశ్రేణిలో ఉండి అనేక అవార్డులందుకున్నారు. అలాంటి





సందర్భాలలో, ఏదైనా ఎల్.ఐ.సి. బోనస్ వచ్చిన సందర్భాలలో ఆయన అందరికి విందు ఏర్పాటుచేసేవాడు. అధికారులు, సిబ్బంది అందరినీ బాబా ప్రేమికులతో కలపివారికి బాబా గురించి తెలియజేసే అవకాశాన్ని కలిగించేవారు. ఒకసారి మూర్తి గారు రోడ్డుపై వెళ్ళుతున్నారు. అది ఆయన బాబా దర్శనానికి వెళ్ళే ముందు రోజు. ఎదురుగా ఒక అపరిచిత వ్యక్తి కనబడ్డాడు. ఏ పరిచయం లేకుండానే సూటిగా అతని వైపు చూచి, నువ్వు భగవంతుని చూడడానికి వస్తావా? అని అడిగారు. ఆశ్చర్యచకితుడైన అతనికి ఏం చెప్పాలో తోచలేదు. కొంతసేపటికి తేరుకొని సరే అన్నాడు. అతని పేరు శంకరయ్య. తాండూరుకు చెందిన నాపరాళ్ళ వ్యాపారి. ఎంతోకాలంగా వసూలు కాని పాత బాకి ఆరోజు అతనికి వసూలైంది. ముందుగా సిద్ధంకాకుండానే మూర్తిగారితో వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాడు. జీవితాంతం ఆతను ఆ సంఘటనను మరచిపోలేదు.

బాబా నామాన్ని వ్యాప్తి చేయడంలో మూర్తిగారు ఎప్పుడు ఎవ్వరికి భయపడలేదు. ఎలాంటి సంఘటనల్లోనైనా పరిస్థితుల్లోనైనా ఒకే విధంగా ఉద్వేగంగా మాట్లాడి బాబా దివ్యత్వాని నిర్భయంగా చాటి చెప్పేవారు. నిజామావాదులో మూర్తిగారు యింటిలో కేంద్రం ఉండగా ఒక వృద్ధురాలు ప్రతివారం బాబా భజనకు వచ్చేది. ఒకరోజు ఆమె భజనకు వచ్చి తిరిగి వెళ్ళుతూ లారీ ప్రమాదంలో మరణించింది. బాబా అనే కొత్త దేవుణ్ణి తెచ్చి అందరినీ బాధిస్తున్నావు? ఏంచేసాడు మీ దేవుడు? తన భజనకు వచ్చిన మా అమ్మను పొట్టనబెట్టు కున్నాడు? ఆమెను నీవుగాని, నీ దేవుడుగారి బ్రతికిస్తారా? అని ఆమె బంధువులు, స్థానికులు అదే అదనుగా తీసుకొని మూర్తి గారిని నిందించారు. ఆయన నిర్భయంగా వెళ్ళి ఆమె దహనానికి ముందు ప్రోగైన వారందరికి, గంభీరంగా యిలా చెప్పారు. రాముడు దేవుడే కదా? ఆయన సేవకు జటాయువు సీతమ్మను రక్షించబోయి రావణుని చేతిలో హతమయ్యింది. కొన ఊపిరితో నున్న జటాయువును చూచి రాముడు దానిని కరుణించాడు. అంటే దానిని మళ్ళీ బ్రతికించాడా? లేదు! స్వయంగా ఆయనే తన నామాన్ని స్మరిస్తూ మరణించిన ఆ జటాయువుకు అంత్యక్రియలు జరిపి ముక్తిని ప్రసాదించాడు. ఆ రాముడే ఈ యుగంలో మెహెర్‌బాబాగా వచ్చాడు. ఆ మెహెర్‌బాబా నామాన్ని కీర్తించి ఈమె చనిపోయింది. ఈమెకు అలాంటి సద్గతే కలుగుతుంది అని చెప్పారు. అందరూ నిశ్చేష్టులై అతి శ్రద్ధతో ఆ మాటలు విని వారి అజ్ఞానానికి సిగ్గుపడి ఆయనకు బాబా యెడల గల విశ్వాసాన్ని శ్లాఘించారు.

అవతార్ మెహెర్‌బాబాలో ఆయనకు గల అచంచల విశ్వాసం వల్ల ఆయనపై బాబా కృప ఎల్లపుడు ఉండదనడంలో సందేహం లేదు. 1955 సంవత్సరంలో జరిగిన సహవాసంలో బాబా ధుని వెలిగించి స్వయంగా తానక్కడ కూర్చొని అందరినీ ఆధుని జ్వాలలో ఒక సమిధను వేస్తూ వదులుకోవాలన్నా వదులుకోలేని తమ బలహీనతను దానితో వదిలి

వేయమని దానికి నేను సహాయం చేస్తానని బాబా చెప్పారు. మూర్తిగారు ఆ రోజు బాబా సమక్షంలో ఏ బలహీనతను వదులుకోవాలా అని ఆలోచించారు. అప్పటి వరకు మూర్తి గారు "చెయిన్-స్మోకింగ్" సిగరెట్టు ఒకదాని తర్వాత ఒకటిగా విరామం లేకుండా త్రాగే అలవాటు గలవారు. భోజన సమయంలో కూడా ప్రక్కనే సిగరెట్ పెట్టి పెట్టుకొనేవాడట. బాబా సమక్షంలో సిగరెట్ కాల్చడం వదిలి వేయడం చాల చిన్న విషయం కదా! అని అనుకున్నాడట. కానీ బలీయమైన అలవాటే బలహీనత కనుక దానిని వదలడమే సమంజసం అనుకున్నాడట. అంతే ధునిలో ఆ బలమైన అలవాటును వదిలేసాడు. ఆ తర్వాత ఎవరైనా సిగరెట్ కాలుస్తుంటే గుడ్డను కాలిస్తే వచ్చే కసరువాసన వచ్చి అక్కడి నుండి దురంగా వెళ్లాలనే భావన కలిగేదని మూర్తిగారు చెప్పగా విన్నాను. ఆ తొలి రోజుల్లోనే మూర్తి గారికి మధుసూదన్ పాడే జహకల్పనా హారతి గ్రామఫోన్ రికార్డు చేయించాలనే ఆలోచన కల్గింది. సంకల్పం కలిగిందంటే సత్వరమే అది జరిగిపోవాలనేది ఆయన ఆశయం.

బొంబాయిలో మాత్రమే ఆ రోజుల్లో గ్రామఫోన్ రికార్డు తయారు చేసే స్టూడియోలు ఉండేవి. అప్పటికి క్యాసెట్లు, సి.డి.లు. టేపురికార్డులు రాలేదు. వెంటనే మధుసూదన్ సుభద్రలను బొంబాయికి తీసుకొని వెళ్ళి గ్రామఫోను రికార్డు తయారు చేయించారు. దానికి కావలసిన డబ్బు ఆయన దగ్గరలేదు. శ్రీరంగపట్టణంలోని తన భూమిని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చి ఆపనిని పూర్తి చేసి ఆదీ-కె-ఇరానీ గారికి రెండు ఆగ్రామఫోను రికార్డులను బహుకరించారు. బాబాకు వినిపించగా ఆయన సంతోషించి ఆ గ్రామఫోను రికార్డుకు మూర్తిగారు ఖర్చు చేసిన డబ్బును మూర్తిగారికి యిచ్చి వేసి దాని హక్కులను తీసుకోమని ఆదీ-కె-ఇరానీ గారిని బాబా ఆదేశించారు.

బాబా సర్వజ్ఞుడు. తన ప్రేమికులకు ఆర్తత్రాణ పరాయణుడు కదా!

జీవిత భీమా సంస్థలోని అధికారులు, ఉద్యోగులు మూర్తిగారిని నీవు జీవిత భీమా సంస్థలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌వుకావు, మెహెర్‌బాబా డెవలప్‌మెంట్ ఆఫీసరువు అనే వారు. అందులో సందేహంలేదు. ఒకసారి ఆర్మూర్ తాలూకాలోని ఒక గ్రామంలోని వారందరికీ భీమా సౌకర్యం కలిగించి దానిని భీమాగ్రామంగా ప్రకటించారు. అ సందర్భంగా అక్కడ జీవిత భీమా సంస్థవారు పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రీజినల్ మేనేజర్ గారిని పిలిచారు. దానిని ఏర్పాటు చేసిన వారిలో ముఖ్యుడు మూర్తిగారు. రీజనల్ మేనేజర్‌గారిని ఆహ్వానించి ఒక ఎద్దులబండిలో కూర్చొబెట్టి వెనక ఎన్నో ఎద్దులబండ్లు వరుసలోరాగా ఊరేగింపుగా తీసుకొని సభను ఏర్పాటు చేసిన వేదిక వద్దకు వెళ్ళారు. ఎక్కడ చూచినా ప్రధానంగా అవతార్ మెహెర్‌బాబా ఫోటోలు సూక్తులే కనిపించగా కొంచెం చికాకుతో ఆ రీజినల్ మేనేజర్‌గారు ఏమిటీ ఇది భీమా సంస్థ కార్యక్రమమా! లేక అవతార్ మెహెర్‌బాబా కార్యక్రమమా? అని అడిగారు. వేదికపై ప్రసంగాన్ని ప్రారంభిస్తూ మూర్తిగారు జీవిత





భీమా సంస్థ "యోగ క్షేమం వహామ్యహం" అనే ఉద్దేశ్యాన్ని భగవద్గీతలోని శ్రీ కృష్ణుని మాటలనే అనుసరించి తీసుకొన్న "మోటో" అని, ఆ శ్రీకృష్ణుడే ఇప్పుడు మెహెర్‌బాబాగా వచ్చారనీ, జీవిత భీమా సంస్థ కేవలం భౌతిక దేహపరంగా భీమా కల్పిస్తే, ఆత్మపరంగా శాశ్వత భీమా కల్పించేది భగవంతుడైన మెహెర్‌బాబాయేనని నిర్భయంగా ప్రకటించి రీజినల్ మేనేజర్ గారిని ఆశ్చర్య చకితుణ్ణి చేయడమే గాక అవతార్ మెహెర్‌బాబా గురించి తెలుసుకునే ఆసక్తిని ఆయనలో కలిగించారు మూర్తిగారు.

బాబా సేవలో ఏ పని చేసినా దీక్షతో అంకిత భావంతో చేసేవారు మూర్తిగారు. మెహెరాబాద్‌లో ఒక సహవాస కార్యక్రమంలో కుటుంబ శాస్త్రిగారు మూర్తి గారిని అందరి పాదరక్షలకు కాపలాగా ఉంచారు. అందరూ వెళ్ళి సమాధి చూచి వచ్చి పాదరక్షలు వేసుకొని వెళ్ళి పోయారు. అయినా మూర్తిగారు అక్కడే ఉన్నారు. మళ్ళీ కుటుంబ శాస్త్రిగారు అటువేపు వచ్చి ఇంకా ఎందుకు ఇక్కడే నిలబడి ఉన్నావు అని అడిగారు. మీరు చెప్పే వరకు ఇక్కడే ఉండమన్నారు కదా అన్నారు మూర్తిగారు. ఇక అవసరంలేదు పద అన్న తర్వాత ఆయనతో వెళ్ళిపోయారు. ఒకసారి నిజామాబాదులో సహవాసకార్యక్రమం జరిగింది. యెల్లమ్మగుట్టలోని వారి యింటివద్దనే భోజనాల ఏర్పాటు చేయబడింది. ఆరు బయట వేడి నీళ్ళు కాయడానికి రాళ్ళు పేర్చి రెండు పెద్ద గిన్నెలను పెట్టి ఉంచాం. రాత్రి పడుకోబోయే ముందు, ఆ రెండు పెద్ద గిన్నెలు అక్కడే ఉండటం చూసి వీటిని ఇక్కడే వదిలేసారు ఎవరైనా ఎత్తుకొని పోతే ఎలా? అన్నారు. బాబా ఉండగా ఎవరు తీసుకొని పోగలరు అని మేము సమాధానం చెప్పాం. అయితే బాబాను ఇక్కడ వాచ్‌మెన్‌గా రాత్రంతా కాపలా ఉండమంటారా? అన్నారు. వెంటనే వాటిని తీసుకెళ్ళి లోపల పెట్టాం. బాబాను ప్రేమించడం అంటే మన బాధ్యతలు కష్టాలన్ని బాబా పైన వేయడం కాదని బాబాను ఎప్పుడు సంతోష పెట్టడానికి మాత్రమే ప్రయత్నించాలని అప్పుడు నేర్చుకున్నాం.

ఆలోబాగారికి మూర్తి గారంటే ఎనలేని ప్రేమ, గౌరవం. నేను అనంతపురం జిల్లాలోని కదిరిలో ఉండగా మల్లయ్యగారి పల్లె, కుంట్లపల్లి అనే గ్రామల్లో రెండు కేంద్రాలు కట్టించి 8.12.90 మరియు 9.12.90 రోజుల్లో ప్రారంభించాం.

ఆలోబాగారిని రమ్మని ఆహ్వానించగా ఆయన రెంటాల సూర్యనారాయణ మూర్తి గారిచే చేయించమని నాకు చెప్పారు. అలాగే ఆరెండు కేంద్రాల ప్రారంభం అప్పుడు మూర్తిగారి చేతులతో చేయించాం. ఆ తర్వాత కదిరి నుండి నిజామాబాదుకు బదిలీపై వెళ్ళి మళ్ళీ రెండు సంవత్సరాలు మూర్తి గారితో కలసి ఉండే అవకాశం బాబా నాకిచ్చారు. ఆయన సాహచర్యంలో బాబా కృపకు పాత్రుడనై "మూకం కరోతి వాచాలం- పంఘుం లంఘయతే గిరి" అన్నట్లుగా బాబా సేవకు ఉపయోగపడే పని ముట్టుగా మార్చబడ్డాను అనేది నా భావన.

మూర్తిగారు పదే పదే చెప్పే రెండు మాటలు నేను మరచి పోలేను. బాబా దివ్య భళ్లూకం (ఎలుగుబంటు) లాంటివాడు. ఆయన నిన్ను పట్టుకుంటే, నీవు వదిలినా ఆయన వదిలి పెట్టడు.

'నిన్ను నే మరచినా నీవు విడవుగా' అనే పాటలో బాబ్జీ అదే గుర్తుచేస్తాడు. అందుకని భ్రమర-కీటక న్యాయాన్ని పాటిస్తాడు బాబా. తను ఎన్నుకొన్న కీటకాన్ని భ్రమరం మట్టి గూటిలో పెట్టి ఆ కీటకం భ్రమరంగా మారే వరకు ఎలా తనహోరును నిరంతరాయంగా ప్రతిధ్వనింపజేస్తుందో అలా "నేను బోధించుటకు రాలేదు- మేల్కొపుటకు వచ్చాను" అని బాబా చెప్పినట్లుగా ప్రతి ఒక్కరినీ మేల్కొలిపి ఆయనలో ఐక్యమయ్యే వరకు బాబా తన ప్రేమ పిలుపును ప్రతి హృదయంలో ప్రతిధ్వనించేలా వినిపిస్తూనే ఉంటారు. బాబా యొక్క ఆ విశ్వకార్యంలో పాల్గొని ఆయన సేవకు తను, మన ధనాలనర్పించుకొన్న శ్రీ రెంటాల సూర్యనారాయణ మూర్తిగారు నిజంగా ధన్యజీవి.

**రెంటాలతో మా పరిచయం- స్నేహం గురించి శ్రీ పి.యస్.కె.శర్మ, హైదరాబాద్, శ్రీ ఏ. జనార్ధనరావు, నిజామాబాద్ రాసి పంపిన వ్యాసాలు వచ్చే సంచికలో ప్రచురించనున్నాం. పరిశీలించగలరు.**

# మెహెర్‌బాబా శతకము

***- సామలరాజమల్లయ్య (సిరిసిల్ల)***

సీ॥ కలియుగ ధర్మమున్‌గావగ నెంచిన
అవతార్! మెహెరుబా! ఆది పురుష!
మనుజుల మేల్కొల్ప మానుషధారివై
మహియందు వెలసిన మౌనరూప!
సకలాంతరాత్మ! ఓ సాధు సంసేవిత!
ప్రేమ భిక్ష నొసంగు ప్రేమరూప!
మునిజన రంజిత! ముల్లోకవందిత!
జగదేక సుందర! జయము జయము
నాదు ఇలువేల్పు వీవని నమ్ముకొంటి
నన్ను రక్షించుటే నీకు న్యాయమంటి
మధుర మంజుల మెహన! మౌన భాష!
స్నిగ్ధదరహాస! మెహెరుబాబా! చిద్విలాస!

**- సశేషం**





# అహంకారము

## (డిస్‌కోర్సెస్ ఆధారంగా)

**మా**నవజన్మ అన్ని జన్మలలోకెల్ల అత్యుత్తమమైనది. ఈ జన్మలోనే "నేను భగవంతుడను" అనే అనుభూతిని పొందగలిగే చైతన్యము ఆత్మకు ఉంటుంది. అనగా మోక్షమును పొందే అర్హత ఈ మానవజన్మలోనే సంప్రాపిస్తుంది.

**జీవితగమ్యము**

స్థూలపరిణామ క్రమములో ఆత్మచైతన్యము రాయి, లోహము, వృక్షము, క్రిమి కీటకములు, పక్షి, చేప, జంతువు, తుదకు మానవునిగా అనేక రూపములు పొందుచు, ఆరూపము తానే అను అనుభవము పొందుచున్నది. అదే విధముగా మానవరూపము దాల్చినప్పుడు ఆశరీరమును తానే అని భ్రమను పొందుచున్నది.

కాని మానవజన్మలో మాత్రము అహంకార కేంద్రము ఆవిర్భవించుట, ఆత్మ చైతన్యమునకు అది అనుసందానము చేయబడుట, అనుభవములను జ్ఞప్తి యందుంచుకొన గల్గుట, అహంకారము యొక్క ప్రయోజనము, అది కల్గించు అవరోధములు, వానిని నివారించుకొను మార్గములు, తుట్టతుదకు అహంకారము "నేను శరీరము" అను అసత్య భ్రాంతిని వీడి, "నేను భగవంతుడను" అను సత్యమును అనుభవించి అనంత దివ్య అహముగా రూపాంతరము చెందుట మొదలగు విషయములను "అహంకారము" అనే శీర్షికలో బాబా డిస్‌కోర్సెస్‌లో వివరంగా తెలియజేసారు.

బాబా " ప్రతిమానవుని గమ్యం ఇదే. నేను అసత్యపు అహంకారమును నిర్మూలించి, ఈ గమ్యమును జేర్చుటకే అవతరించాను" అన్నారు.

అందుచేత ఈ విషయములను మరల జ్ఞప్తికి తెచ్చుకొని, దాని ప్రయోజనమును పొందే ప్రయత్నం చేద్దాం.

**అహంకారము- పుట్టుక**

ఉదాహరణకు జంతుజన్మలో ఒక కుక్కకు కోపమువచ్చి కరచినచో దానికి "నాకు కోపము వచ్చినది- నేను కరచితిని" అనే అనుభవము దానికి ఉండదు. కారణము ఏమనగా జంతుజన్మ వరకు "అహంకారము" అనే కేంద్రము ఏర్పడలేదు. ఆత్మ చైతన్యము ఆ అనుభవమును నిలువచేసికొన లేదు.

కాని మానవజన్మలో, ప్రప్రథమంగా "అహంకార కేంద్రము" ఏర్పడి, ఆత్మ చైతన్యము దీనితో అనుసంధానము చేయబడియుండుటచే, అట్టి అనుభవములన్నీ అహంకార

కేంద్రములో నిలువచేయబడి యుండును. అందువలన మనకు " నేను ఈ పని చేసితిని. ఈ కష్టము లేదా సుఖము అనభవించితిని" అను విషయములు జ్ఞప్తి యందుండును. బాబా దీనిని మనము భద్రపరచుకున్న "నిధి" వంటిది అన్నారు.

మనస్సు దాచుకున్న నిధిని క్రమ పద్ధతిలో, అవసరమైన పనులకు ఏవిధముగా సద్వినియోగము చేస్తామో అదేవిధముగా ఈ అనుభవముల సారమును గ్రహించి, భవిష్యత్తులో ఆత్మచైతన్యమును పరమాత్మ చైతన్యమువైపునకు (జీవిత గమ్యమువైపు) నడిపించు కొనవలెను.

అందుచేతనే "Man is the architect of his own future" "మానవుడు తన భవిష్యత్తును తానే తీర్చిదిద్దుకొనగలడు" అనే నానుడి పుట్టింది.

**అహంకారము- దాని ప్రయోజనము**

దీనిని బాబా ఒక ఉదాహరణతో వివరించారు. ఓడ నీటిలో స్థిరముగా లేదా నిలకడగా ఉండాలి అంటే దానిలో తగినంత బరువు వేయాలి. లేనిచో ఆ ఓడ చెల్లాచెదరై, అలలతాకిడికి స్థిరత్వమును కోల్పోయి, గమ్యమును చేర్చలేదు.

అదే విధముగా మానవజన్మలో "అహంకార కేంద్రము" ఏర్పడనిచో ఆత్మ చైతన్యము పొందే అనుభవములు చెల్లాచెదురై మానసిక శక్తి అంతా వృథా అయి, ముందుకు సాగే శక్తిని కోల్పోతుంది. ఈ అహంకార కేంద్రమువలనే ఆత్మచైతన్యమునకు గమ్యమువైపు పయనించే శక్తి సమకూరుతుంది.

**అహంకారము వలన ఏర్పడు సమస్యలు**

ఒక పిచ్చివాని చేతికి కత్తినిస్తే అదివానికి, ఎదుటి వారికి గూడ హాని కల్గిస్తుంది. అదేవిధముగా అహంకార ప్రయోజనమును విస్మరించినచో అది దాని గమ్యమును జేర్చేబదులు తప్పు త్రోవలను నడిపిస్తుంది. ఆత్మచైతన్యమును భౌతిక జీవనమువైపునకు త్రిప్పుతుంది. దేహమే తానని భ్రమింపజేస్తుంది.

అశాశ్వత విలువలకు శాశ్వతమైన విలువలు ఇస్తుంది. శాశ్వత విలువలకు అశాశ్వతమైన విలువలు ఇస్తుంది. తనకు ఇతరులకు మధ్య అగాధము సృష్టించి అనేక దుఃఖములకు గురి చేస్తుంది.

**ఉదాహరణ**

ధనము ప్రతివానికి అవసరమే కాని, ధనమే పరమార్థముకాదు. కాని అహంకారము ధనమునకే ప్రాధాన్యతనిచ్చి, అత్యాశకు బానిస అయి, తప్పుడు నిర్ణయములు తీసుకొంటుంది. అశాశ్వత వస్తువుల నుండి, శాశ్వత ఆనందాన్ని పొందాలని ప్రయత్నించి, విఫలమై మరింత దుఃఖానికి గురిచేస్తుంది.

**ఈర్ష :** నాకు వచ్చిన కష్టములు ఇతరులకు రావాలని కోరుకునే చిత్తవృత్తి





**అసూయ:** తనకు వచ్చిన సుఖములు ఇతరులకు కలుగరాదు అనే చిత్తవృత్తి.

ఈ రెండు అహంకారమును విపరీతముగా పెంచిపోషిస్తాయి.

**అహంకారము- నివారించుకొను విధానములు**

అహంకారము - ప్రేమ పరస్పరము వ్యతిరేక స్వభావములు. "అహంకారముని రూపుమాపుకోవాలంటే ప్రేమను ప్రజ్వలింపజేసుకొనవలసిందే" అన్నారు బాబా.

వానిని ఈ క్రింది విధంగా బాబా పోల్చారు.

**అహంకారము**

1. ఈర్ష్య, అసూయ, భయము క్రోధము మొదలగువానితో తన ప్రత్యేకతను చాటుకొనును.
2. "నేను వేరు- నీవు వేరు" అను ద్వైతభావమును పెంచి పోషించును
3. ఆధ్యాత్మిక అభివృద్ధిని ఆటంక పరచును
4. కోరికలు సఫలమైతే అహంకార విజయము. కోరికలు విఫలమైతే అహంకార పరాజయము

**ప్రేమ**

1. ప్రియతమునితో ఐక్యమును కోరుకొనును.
2. "నేను - నీవు ఒక్కటే" అనే ఏకత్వమును సిద్ధింపజేయును.
3. అహంకారం లక్షణములను బలహీనపరుచును.
4. కోరికలనుండి విముక్తిని కలుగజేయును.

అహంకారము మనకు కల్గించే నష్టములనుండి తప్పించుకొనవలెనన్న, దానికి వ్యతిరేక లక్షణములు గల ప్రేమను అలవరచుకోవాలని బాబా అన్నారు. వేరే మార్గము లేదు అన్నారు.

**సద్గురువును ఆశ్రయించుట**

అసత్యపు విలువతో కల్గిన అనుభవముల వలన అలసిపోయిన అహంకారము, తన అశక్తతను గ్రహించి, సద్గురువు ప్రధాన పాత్ర పోషించునట్లు అంగీకరించును. సద్గురువు పర్యవేక్షణలో సత్యపదార్థము వైపు దృష్టి మరల్చును. తన మంచి, చెడులను సద్గురువునకు సర్వసమర్పణము చేసినందువలన ఆ ద్వంద్వములు ఆతనిని బాధించవు. వాటినుండి విముక్తుడగును.

సద్గురువు శిష్యునిలోని అహంకారమును అంగీకరించునట్లు చేసి, పిమ్మట అహంకారమును దివ్య అహముగా మార్చి, నేను భగవంతుడను అనే స్పృహను శిష్యునకు కల్గించును. ఇదే జీవితగమ్యము.

**మామాటలు**

## సిరిసిల్ల సెంటర్ 26వ వార్షికోత్సవం

కరీంనగర్ జిల్లా సిరిసిల్లా బాబా సెంటర్ 26వ వార్షికోత్సవం జూన్ 28 ఆదివారం సా॥ 5 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్నట్లు, సెంటర్ అధ్యక్షులు శ్రీ సామల రాజమల్లయ్య ఆహ్వానం పంపినారు.

## వివాహం

చి॥ నాగశ్రీకాంత్ వివాహం చి॥ల॥సౌ॥ జ్యోత్స్న తో పవిత్ర బ్యాంక్వెట్‌హాల్, తాజ్‌మహల్‌హోటల్, నారాయణగూడ క్రాస్ రోడ్ దగ్గర, హిమాయత్‌నగర్, హైదరాబాద్‌లో 13.06.2009, శనివారం జరుపుతున్నట్లు శ్రీమతి చింతల సావిత్రమ్మ-జనార్థన్ దంపతులు ఆహ్వానం పంపారు.

## వివాహం

చి॥ల॥సౌ॥ సుష్మ వివాహం చి॥సురేష్ తో టి.టి.డి. కళ్యాణ మండపము, కదిరి అనంతపురంజిల్లాలో 17.06.2009, బుధవారం జరుపుతున్నట్లు శ్రీమతి దేవకి సునీతా - నటరాజ్ దంపతులు ఆహ్వానం పంపారు.

## శ్రీకాకుళం సెంటర్

అవతార్ మెహెర్‌బాబా శ్రీకాకుళం కేంద్రం అధ్వర్యంలో 28.06.2009 ఆదివారం ఉ॥ 7 గ॥ల నుండి సాయంత్రం 7 గంటల వరకు హరే మెహెర్ హరే మెహర్ ఏకాహం కేంద్ర భవనంలో నిర్వహించడమైనది. అతి ప్రశాంత ప్రేమ వాతావరణంలో నామసంకీర్తన సాగినది. ఉ॥ 7 గం॥ లకు ప్రార్థనతో ప్రారంభించి సాయంత్రం 7 గం॥లకు ప్రార్థన, అనంతరం ఆరతి పాటతో కార్యక్రమం ముగిసినది. సుమారు 150 మంది ప్రేమికులు పాల్గొన్నారు.

4.07.09 శనివారం సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీకాకుళంనకు 30 కి.మి. దూరంలో గల మధుపాం గ్రామంలో గల రామాలయప్రాంగణంలో గ్రామ పెద్దల సహకారంతో అవతార్ మెహెర్‌బాబా నామసంకీర్తన జరిగినది. ఇందు సో॥ ఎస్.వి.సత్యనారాయణ గారు బాబా ప్రేమ సందేశములను ప్రసంగించిరి.

సో॥ వి.కామేశ్వరావు మెహెర్ విద్యావిహార్ పిల్లలచే బాబా జీవిత చరిత్రపై చక్కని నృత్యప్రదర్శన గావించిరి. శ్రీకాకుళం నుండి సుమారు 30 మంది ప్రేమికులు పాల్గొనిరి.





సుమారు 300 మంది గ్రామప్రజలు ఈ సంకీర్తనలో పాల్గొని బాబా జీవితవిశేషములు తెలుసుకొని ఆనందించిరి. బాబా కరపత్రములు, చిత్రపటములు అందరకు పంచి పెట్టడమైనది. *-రంగప్రసాద్, కార్యదర్శి, శ్రీకాకుళం కేంద్రం*

# పార్వతీపురం

అవతార్ మెహెర్‌బాబా పార్వతీపురం కేంద్రం 2009-2010 వార్షిక ఎన్నికలు 28.06.09న శ్రీ మంచిపల్లి శ్రీరాములుగారి ఆధ్వర్యంలో జరిగినాయి.

నూతన కార్య వర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది.

**నూతన కార్యవర్గం**

గౌరవాధ్యక్షులు:శ్రీ బొండపల్లి అప్పలస్వామి, అధ్యక్షులు: డా॥ మంచిపల్లి శ్రీరాములు, ఉపాధ్యక్షులు: శ్రీ పసుమర్తి గురునాధం, కార్యదర్శి:శ్రీ కొత్తకోట శ్రీనివాసరావు, జాయింట్ కార్యదర్శి : శ్రీ ఆబోతుల త్రినాధరావు, కోశాధికారి :శ్రీ సాధనాల సూర్య నారాయణ, ఉప కోశాదికారి: శ్రీ లాడెబాల కృష్ణ, ఎగ్జిక్యుటివ్ సభ్యులు : శ్రీమతి తిరుమరెడ్డి లక్ష్మి, శ్రీ యం. శ్రీనివాసరావు, శ్రీ బి.వెంకటరావు, శ్రీ కె.రాజారావు, శ్రీ టి. సూర్యారావు, శ్రీ జి. గణపతి, శ్రీ బి.రవికిరణ్, శ్రీ వి.శ్రీనివాస్‌రావు

# నిర్యాణం

శ్రీ పరకల లక్ష్మీనారాయణ, కదిరి, అనంతపురం జిల్లా, మెహెరుని మౌనం దినంనాడు, జూలై 10, 2009 బాబాలో ఐక్యమయ్యారు. శ్రీ లక్ష్మీనారాయణ గొప్ప సంగీత విద్వాంసుడు. ముఖ్యంగా హార్మోనియంపై ఎందరికో సంగీతవిద్యాదానం చేసిన బాబా ప్రేమికుడు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, హైదరాబాద్‌కు కూడా శ్రీ లక్ష్మీనారాయణ హార్మోనియం నేర్పారని ఆయన బాబాను అమితంగా ప్రేమిస్తారని ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుతూ శ్రీ రామక్రిష్ణయ్య వారి కుటుంబసభ్యులకు తన సంతాపం తెలియజేశారు.

## ఆంధ్రా రెస్ట్‌హౌస్, మెహెరాబాద్

**ఫోన్: 0241- 2548544**

**ఆంధ్రా రెస్ట్‌హౌస్, మెహెరాబాద్‌లో భోజన వసతిలకోసం రోజు మొత్తానికి రూ. 70 /- చొప్పున వసూలు చేయాలని నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మొత్తంలో - భోజనం (లంచ్ & డిన్నర్), టీ (ఉ. 6-6.30), తిరిగి బ్రేక్‌ఫాస్ట్ & టీ (ఉ.8-9) లభిస్తాయి.**

# బాటసారులు

**చా**చా చరిత్రను గురించి అజ్మీరులో అనేక మందిని ఆడిగి బైదుల్ తెలుసుకొని చెప్పిన విషయములు ఇక్కడ వ్రాయుచున్నాను. చాచా ఒక పఠాను. అతని అసలు పేరు నూర్ ఆలీషా, చాలా సంవత్సరముల క్రిందట పెషావర్ సమీపముననున్న అతని నివాసమును విడచి అజ్మీర్ వచ్చెను. అతని భార్యా, పుత్రుడు ఇంకా బాగున్నారు. అప్పుడప్పుడు అతని కుమారుడు ఈ ముసలితండ్రిని చూచుటకై పెషావరు నుంచి వచ్చుచుండును. చాచా ఒక హాఫీజ్. అనగా కొరాన్ గ్రంథమంతయు కంఠస్థము చేసుకున్నవాడు. అరబ్బీ భాషను నేర్పుటకు అతడు అజ్మీర్ వచ్చి యుండెను వచ్చిన అనతికాలమనకే ప్రసిద్ధమైన ఖ్వాజా మోయినుద్దీన్‌ఛిష్తి దర్గాను చూచుటకు వెడలెను. అప్పటినుంచి తనకు అక్కడే ఉండిపోవలెనని బలమైన కోరికకలిగెను. పన్నెండుసంవత్సరములు ఖ్వాజాసాహెబ్ దర్గాలోని "సోలాఖంబా" గోరీలదొడ్డిలో ఉండెను. ఆ కాలంలో అక్కడ అతనికి ఏమయినదోగాని అప్పటినుంచి అతను మజ్జూబ్ అయ్యెను. పన్నెండు సంవత్సరముల యనంతరము దర్గానుండి అతడు బయటికివచ్చి ఇంకొకచోట ఆరుసంవత్సరములు కూర్చొనెను. ఆ తరువాత అజ్మీరుకు వెనుకనున్న పర్వతము మీద నున్న తారాగడ్ కోటలో ఒక సంవత్సరం గడిపెను.

తారాగడ్‌నుండి దక్షిణముగా 300 మైళ్ళ దురంలోవున్న ఇందోర్‌కి వెళ్ళెనని, అక్కడ చనిపోయెనని అతని శరీరమును పాతిపెట్టిరని నమ్మజాలని ఒక కట్టుకథ ఉన్నది. ఇందోర్‌లో అతనిని గంజాబాబా అని పిలిచెడివారు. గంజా అనగా బట్టతలవాడని అర్థం. అతడు చనిపోయాడన్న ఒక సంవత్సరం తరువాత కొంతమంది ఇందోర్ నుంచి అజ్మీర్‌కి ఖ్వాజాసాహెబ్ దర్గాలో వార్షికోత్సవము తిలకించుటకై వెళ్ళి **అక్కడ ఒక నీటికుళాయిదగ్గర వాళ్ళ గంజాబాబా,- చావచ- కూర్చుండగా చూచి పరమాశ్చర్యము పొందిరి ఇందెర్‌లో ఉన్నప్పుడు అతడు మరణించగా చూచిన**వారు పాతిపెట్టబడగా చూచినవారిని తోడ్కొనివచ్చి అతడే యితడని ఆనవాలు పట్టించిరి. ఈ వింత వృత్తాంతము ఆనోటా ఆనోటా ఆ ప్రాంతాలలో వ్యాప్తమైనది. చాచా ప్రసిద్ధపురుషుడు అగుచుండెను. ఇది జరిగిన యదార్థవిషయమో లేక కల్పితగాథో పాఠకులు ఎవరికివారే నిర్ణయించుకోవలెను. చాచావంటి వ్యక్తిని గురించి చెప్పుకొనుటకు వీలున్న ఒకవింతైన వృత్తాంతమునకు ఒక ఉదాహరణమని చెప్పవచ్చును. కొన్ని సంవత్సరాలు ఆ కుళాయి ప్రక్కన కూర్చుని ఆ సమీపంలోనే ఒక చిన్న కొట్టములోకివెళ్ళి అక్కడ పదునారు పదునెనిమిది సంవత్సరములు నివసించెను. ఫిబ్రవరి 1939లో బాబా మొదటిసారిగా చాచాను కలసికొనెను. 1938 డిసెంబరులో





కొంతమంది ప్రాచ్యపాశ్చాత్యశిష్యులతో బాబా మోటారులో పర్యటనకై బయల్వెడలిరి. మెహెరాబాద్‌నుంచి వారు మొదట హైదరాబాద్‌కు వెళ్లిరి. ఈవూరు దక్కన్ పీఠభూమిమీద మధ్యస్థముగా అర్థచంద్రాకారముగాను కొండల నడుమనున్నది. ఆటనుండి ఉత్తరదిశగా జబల్‌పూర్‌మీదుగా మధ్యపరగణాలలోని అరణ్యముగుండా వారణాసి, ఆగ్రా, మథుర, ఢిల్లీ పట్టణములకు వెళ్ళియుండిరి. పూర్వము అనేకమారులు యుద్ధములలో బాణములచేతను తుపాకిగుండ్లచేతను దెబ్బలుతినియున్న ప్రాకారముల గల చరిత్రాత్మకమయిన ఈ సుందర మహానగరములను దర్శించివారు పడమటగా రాజపుతానాలోని ఇసుక ఎడారులమీదునుండి పయనించి ఆరావళీ పర్వతములచే పరిరక్షింపబడుచు అఖిలభారతదేశమునందునూ అశేష మహమ్మదీయ ప్రపంచము నందంతను విశేషఖ్యాతిని గాంచిన ఖ్వాజామోయినూద్దీన్ చిష్తి యొక్క నివాసము గలిగియున్న అజ్మీరుపట్టణము ప్రవేశించిరి.

అక్కడకు వెళ్ళిన కొలది దినముల యనంతరము అక్కడ చాలామంది మస్తులను కలిసికొని వారికై ఒక చిన్న ఆశ్రమము స్థాపించిరి. ఈ ఆశ్రమము ఇంకొకచోట వర్ణింపబడినది. కావున ప్రస్తుతము చాచాతో బాబాగావించిన పనిని గురించి మాత్రము వ్రాయుదును. ఆ సమయమునందు ఖ్వాజాసాహెబ్ దర్గా సమీపమున అపరిశుభ్రమగు కీటకావృతమైన చిన్నగదిలో చాచా నివసించుచుండెను. ఆ గది నుండి అతను బయటకు వచ్చినట్టుకూడా ఎవ్వరికీ తెలియదు. ఒక ముజావర్ (పరిచారకుడు) అతనికి కావలసినవి తెచ్చియిచ్చుచుండెడివాడు. నమ్ముటకు వీలులేనంత కళ్ళములుతో నిండియుండెడివాడు చాచా. అతను ఒక పాతటోపీ (హాట్) ధరించి యుండెను. పాసిపోయిన ఆహార శేషములతోను, ఒలికిన నిలవ తేనీటిమరకలతో నిండిన మురికి గుడ్డల దుర్వాసనతోను కూడియుండెను. అతనికి చా (టీ తేనీరు) అంటే మిక్కిలి యిష్టము అది కావలసివచ్చినప్పుడు 'చా' 'చా' అని యరచుచుండుట చూసి అతనిని చాచాయని పిలువజొచ్చిరి. తెప్పించుకొనిన టీలో చాలాభాగము త్రాగుటకు బదులు అతనిబట్టలమీద ఒలకబోసుకొనును. అంతే కాదు, అతనినెత్తిమీదనున్న టోపీకూడా టీలో తడిసేది. ఇలా ఆ టీతోను పంచదారతోను నాని బంకలా పట్టుకొని అతనితలకు ఆ టోపీ తీయటకు వీలులేకుండ అతుక్కుపోయినది.

బాబావద్దకు చాచాను తీసికొనివచ్చుటకు కాకా పంపబడెను. కరీంబాబా విషయంలోవలెనే చాచా యొక్క అంతరంగమును తెరుచుటకు బాబా తాళంచెవి యిచ్చి యుండనోమో, ఎలాగయితేనేమి, ఇది వరకు ఎవరూ చేయలేని పనిని అతడుసాధించి చాచానుబాబా యొద్దుకు తీసికొనివచ్చి అచ్చటివారినందరిని అత్యాశ్చర్యాన్వితులగావించెను ఎందువల్ల ననగా చాచా అజ్మీర్ వచ్చినది లగాయతు ఇన్ని సంవత్సరములలోనూ ఎవ్వరు ఎక్కడికి రమ్మని పిలిచినా తాను ఉన్న చోటనుంచి కదలలేదు. ***(సశేషం)***

# కేటీ ఇరానీ



బాబా మండలి సభ్యురాలు కేటీ ఇరానీ మే 29 తెల్లవారుఝామున 4.10 నిముషాల సమయంలో తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె వయస్సు 89 సంవత్సరాలు. ఆమె కొంతకాలంగా అస్వస్థతతో మెహెరాజాద్‌లో వుంటున్నారు. బాబా సమాధికి తూర్పున కేటీ ఇరానీ సమాధిని కూడా బాబా ఆదేశాలమేరకు ఏర్పాటుచేశారు.

ఈమె సోదరి డాక్టర్ గోహెర్ ఇరానీ. ప్రస్తుతం పాకిస్థాన్‌లో భాగమైన క్వెత్తా వీరి స్వగ్రామం. వీరి ఇటింకి బాబా పలుమార్లు సందర్శించారు. ఒక సందర్భంలో బాబా వీరి తల్లితో మాట్లాడుతూ... ఆమెని నీకెంతమంది పిల్లలు అని ఏమీ తెలియనట్లు అడిగారు. అందుకు ఆమె అమాయకంగా – ఎందుకు బాబా అంటూ... నాకు ఏడుగురు పిల్లలని జవాబిచ్చింది. అందుకు బాబా – లేదు.. నీకు ఐదుగురు పిల్లలే. మిగిలిన ఇద్దరూ నా వాళ్ళు అన్నారు. బాబా మాటల్లోని అర్థం, ముఖ్యంగా మా అమ్మకు అర్థంకాలేదని కేటీ తన గురించి చెప్పేటప్పుడు ముందుగా చెప్పేది. ఆ రకంగా గోహెర్, కేటీలను తనవాళ్ళుగా వారికి ఊహరాకపూర్వమే బాబా నిర్ణయించారు. క్వెట్టాలో వుంటున్న వీరి ఇంటికి బాబా 1922లో వెళ్ళారు. అప్పుడే బాబాని తొలిసారిగా కేటీ చూసింది.

అప్పుడు ఆమె వయస్సా రెండేళ్ళు.

బాబా మెహెరాబాద్‌లో వుండేరోజుల్లో నిర్వహించిన స్త్రీ మండలి సభ్యురాలిగా కేటీ చేరింది. బాబా మండలివారితో కల్సి బ్లూ బస్సు యాత్రలో కేటీ పలుమార్లు పాల్గంది. బాబా నవజీవనం కార్యక్రమాన్ని 1949లో ప్రారంభించేందుకు ముందుగా మెహెరాబాద్ స్త్రీ మండలిని రద్దుచేశారు. ఆ సందర్భంగా బాబా కేటీని ముంబయికివెళ్ళి అక్కడున్న తన ప్రేమికులు నారిమన్, ఆర్నవాజ్ దాదాచాంజ్‌లతో వుండమన్నారు. అక్కడ వారింట్లో ఖాళీగా కూర్చోవడం కాదు... ఏదైనా ఉద్యోగం చేయమని బాబా కేటీని ఆదేశించారు.

ఆ మాదిరిగా ముంబాయి వెళ్ళి నారిమన్ ఇంట్లో వుంటూ జపనీస్ కన్సులేట్‌లో కన్సులేట్‌కు పర్సనల్ సెక్రటరీగా సుమారు రెండు దశాబ్దాలు పనిచేశిందామె.

ఈ సమయంలో వీలు చిక్కినప్పుడల్లా బాబా ఎక్కడవున్నా ఆయన దర్శనార్థం వచ్చేది. 1978లో ఈమె సోదరి – డా. గోహెర్ మెహెరాజాద్‌లో ఆసుపత్రి ప్రారంభించి, తనకు సహకారిగా రమ్మని పిలవగా అప్పటినుంచీ కేటీ మెహెరాజాద్‌లోనే స్థిరపడింది..





బాబా ఎప్పుడు ఏమిచెప్పినా... అవును బాబా ... అంటూ విధేయత చూపడమే తనకు చాతనవునని, బాబా మాటకు ...నో...అని అనడం నేనెరుగనని కేటీ తన గురించి అడిగినవారితో చెప్పేది. అంతేకాదు బాబా ఆమెని ముంబాయి వెళ్ళమన్నప్పుడు, ఆ నగరమంటేనే ఆమెకెంతో అయిష్టతవున్నా, బాబా బంబాయి వెళ్ళమనగానే .యస్ ..బాబా అనిమాత్రమే అన్నానని ఇలా అనేక సందర్భాలు అనేకం అని అమె తన సన్నిహితులతో అన్నారు. ఏ అరోగ్య కారణమో ఇతమిద్దంగా తెలియదు కానీ ఉన్నట్లుండి, నడుస్తున్న మనిషికాస్తా నిసత్తువగా ఆమె నేలపై కుప్పకూలిపోయేది. అంతుచిక్కని ఈ వ్యాధితో బాధపడుతున్న కేటీతో బాబా ఎప్పుడైనా క్రింద పడగానే–గుడ్‌బై బాబా అని బిగ్గరగా అరవమని, ఆ అరుపు మెహెరాజాద్‌లో వుండే తన చెవులకు తాకాలని బాబా ఆమెని ఆదేశించారు. ఆమె ఎప్పటిలానే – యస్ బాబా – అని బాబా ఆదేశాలు కడదాకా పాటించిందామె.

తన జీవితమంతా అవతారుని నామస్మరణతో, ఆయన సేవలో తరించిన ధన్యజీవి కేటీ ఇరానీ. మెహెరుని సేవలో ఆమె అనుభవాలు తెలపమని ఎవరైనా ఆమె దరిచేరితే, అలుపెరగక ఎన్నో విషయాలు అమె చెప్పేది.

అవతారునితో ఆమె మధుర జ్ఞాపకాలని గ్రంధస్థం చేయాల్సివస్తే ఆ పుస్తకానికి ఫాలింగ్ ఫర్ బాబా అని పేరు పెట్టాలనివుందని ఆమె చెప్పేది. ఆనారోగ్యంతో ఆమె తరచు కిందపడిపోయేది కదా .... ఆ పేరు అందుకని అనేదామె. .....

# జీవిత సభ్యత్వం

## 2009 జూన్– జూలై నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1 | జూన్ 09 | ఎల్. వి. పవన్ కుమార్, విశాఖ | రు. 1000.00 |
| 2. | జూన్ 09 | డి. సూర్యనారాయణ, హైదరాబాద్ | రు. 1000.00 |
| 3. | జూన్ 09 | శ్రీ శాస్త్రి, హైదరాబాద్ | రు. 500.00 |
| 4. | జూన్ 09 | లింగా వెంకన్న చౌదరి, ముటుకూరు | రు. 1000.00 |
| 5. | జూన్ 09 | కోట నరసింహ్మారావు, నర్సరావుపేట | రు. 500.00 |
| 6. | జూన్ 09 | ఆర్. ఆది శేషు, ధర్మవరం | రు. 500.00 |
| 7. | జూన్ 09 | పి. వెంకటేశ్వర్లు, ధర్మవరం | రు. 500.00 |
| 8. | జూన్ 09 | సి. హెచ్.రామక్రిష్ణారావు, విశాఖ | రు. 400.00 |
| | | మొత్తం | **రు. 5,400.00** |